వృద్ధాప్యంలోనూ రాజసం



వయసు అనేది మనసుకు కాదని నిరూపిస్తున్నారు రాజకుమారి అనే వృద్ధురాలు. డెబ్బై ఎనిమిదేళ్ల ఈమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కర్నూలు, హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు. అప్పట్లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగానూ అవార్డు అందుకున్నారు. పిల్లలు ఎదిగి ఉద్యోగాల్లో స్థిర పడిన తర్వాత ఒంగోలులోని ఓ వృద్ధాశ్రమంలో ఉంటూ తనకు ఇష్టమైన చిత్రకళను వ్యాపకంగా మలుచుకున్నారు. మట్టి పాత్రలు, వస్త్రాలు, వ్యర్థాలపై అందమైన చిత్రాలు గీసి ప్రదర్శనకు ఉంచుతున్నారు. పలువురికి బహుమతులుగానూ అందిస్తున్నారు. మంగళవారం వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఇష్టమైన వ్యాపకాలతో జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలనే సందేశాన్నిస్తున్నారు. – ఈనాడు, ఒంగోలు

పింఛన్లకు రూ.122.64 కోట్లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 2,88,144 మంది పింఛన్ లబ్ధిదారులకు అక్టోబర్ నెల కింద రూ.122.64 కోట్ల నగదు విడుదలైనట్లు డీఆర్డీఏ పీడీ వసుంధర తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే నగదు పంపిణీ చేసేలా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సీఎస్‌పురం మండలం భైరవకోనలోని శైవ పుణ్యక్షేత్రంలో ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు దసరా శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో డి.వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. 3న గణాధిపతి పూజ, పుణ్యాహవాచనం, స్వామికి మహన్యాసకపూర్వక రుద్రాభిషేకం, త్రిముఖ దుర్గాదేవికి కుంకుమార్చన, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలతో పాటు త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని శ్రీబాల త్రిపుర సుందరీ దేవిగా అలంకరించనున్నట్లు చెప్పారు. 4న రాజరాజేశ్వరీ దేవి, 5న అన్నపూర్ణా దేవి, 6న గాయత్రీ దేవి, 7న మోహినీ దేవి, 8న గజలక్ష్మీ దేవి, 9న సరస్వతీ దేవి, 10న మహిషాసురమర్దని, 11న లలితా దేవిగా అలంకరించనున్నట్లు వివరించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రతిరోజూ స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం ఉంటుందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



అమ్మ నా చేతులు కట్టేసింది బాబోయ్...



ఈనాడు, ఒంగోలు: ఒంగోలు నగరానికి చెందిన దంపతులు తమ అయిదేళ్ల కుమారుడితో కలిసి వస్తువుల కొనుగోలుకు బస్టాండ్ కూడలి సమీపంలోని మార్కెట్‌కు సోమవారం వచ్చారు. దుకాణాల్లో వస్తువులు తీయకుండా ఆ తల్లి తన కుమారుడి రెండు చేతులను తువ్వాలుతో కట్టేసింది. తాను దుకాణాల వెంట తిరుగుతూ బేరసారాల్లో నిమగ్నమై ఉండటంతో కుమారుడిని చూస్తుండాలని భర్తను పురమాయించింది. మద్యం అలవాటున్న సదరు వ్యక్తి కొద్దిసేపటి తర్వాత కుమారుడిని అక్కడే వదిలి మద్యం తాగేందుకు వెళ్లాడు. ఈ సమయంలో ఆ చిన్నారి తప్పిపోయి మార్కెట్లో ఏడుస్తూ తిరగసాగాడు. మరోవైపు తల్లి అతని కోసం బస్టాండ్ వద్ద గాలించసాగింది. చిన్నారిని గుర్తించిన పలువురు అతడి వివరాల కోసం ఆరా తీశారు. కట్టేసిన చేతులను విప్పేందుకు ప్రయత్నించగా.. 'అమ్మ కట్టేసింది.. తీస్తే తిడతాది' అని వద్దని చెప్పడం గమనార్హం. చివరికి అతడి కట్లు విప్పి బస్టాండ్‌కు తీసుకెళ్లగా.. అక్కడ తల్లిని గుర్తుపట్టి ఏడుస్తూ చెంతకు చేరాడు.



మైథిలి.. నిర్లక్ష్యపు ఆటలో ఓడి!

▶ బాధ్యత మరిచిన జట్టు నిర్వాహకులు
▶ అనంత వాయువుల్లో కలిసిన క్రీడాకారిణి ప్రాణాలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే:



విగత జీవిగా మైథిలి

పొన్నలూరు మండలం ముండ్లమూరివారిపాలెం గ్రామానికి చెందిన పదిహేనేళ్ల ఫుట్‌బాల్ క్రీడాకారిణి సన్నెబోయిన మైథిలి.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా అండర్-17 జట్టుకు ఎంపికైంది. పల్నాడు జిల్లా వినుకొండలో గత నెల 28, 29, 30 తేదీల్లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. లీగ్ దశలోనే జిల్లా జట్టు ఓటమిపాలవ్వడంతో జట్టు కోచ్, మేనేజర్ బాలికలను తీసుకుని ఆదివారం రాత్రి తిరుగుముఖం పట్టారు. రాత్రి సుమారు 9.40 గంటల సమయంలో ఒంగోలు బస్టాండ్‌కు చేరారు. ఆ రాత్రికి క్రీడాకారిణులను ఒంగోలు నగరంలోని ఏదైనా బాలికల వసతి గృహంలో ఉంచి.. తెల్లారిన తర్వాత వారి కుటుంబీకులను పిలిపించి స్వస్థలాలకు పంపించాల్సి ఉంటుంది. ఇక్కడే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

▶ **పంపించి.. చేతులు దులుపుకొని...:** రాత్రి సమయాన పది గంటల సమయంలో క్రీడాకారిణులను వారి దారిన వారిని వదిలేశారు. మైథిలిని ఆమె కోసం వచ్చిన కృపాకర్ అనే యువకుడితో పంపించి చేతులు దులుపుకొన్నారు. వీరిద్దరూ స్కూటీపై వెళ్తుండగా నెల్లూరు జిల్లా మద్దూరుపాడు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. పదహారో నంబరు జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృపాకర్ ఎగిరిపడిపోగా.. మైథిలి కిందపడిపోవడంతో లారీ ఆమె కాళ్ల పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడింది. ప్రమాద విషయం తెలిసి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆమెను వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది.

▶ **కనీసం వివరాలూ తెలుసుకోకుండా...:** క్రీడాకారిణుల పట్ల ఎస్‌జీఎఫ్ బాధ్యుల నిర్లక్ష్య వైఖరి ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బాలికలను ఏదైనా క్రీడా కార్యక్రమానికి తీసుకెళ్లినప్పుడు అత్యంత బాధ్యతగా వ్యవహరించాలి. రాత్రి వేళ 9.40 గంటలకు వారిని ఒంగోలు బస్టాండ్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. విద్యార్థినుల కోసం వచ్చిన వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. ఈ సమయంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వనజ తన ఫోన్ స్విచాఫ్ చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఆమె స్పందిస్తూ జట్టు మేనేజర్లు తనకు కనీస సమాచారం ఇవ్వలేదని చెబుతున్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఫుట్‌బాల్ క్రీడాకారిణి ప్రాణాలు రోడ్డు ప్రమాదం రూపంలో అనంత వాయువుల్లో కలిశాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కారే లేదు.. డ్రైవర్లకు జీతాలు




జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం

అప్పటి అధికార పార్టీ నాయకులు చెప్పారంటూ జిల్లా యంత్రాంగం నిబంధనలు ఉల్లంఘించింది. ఏదైనా శాఖలో పరిపాలనా పరంగా అవసరమైతేనే ఉద్యోగులను తాత్కాలిక పద్ధతిపై తీసుకోవాలనే విషయాన్ని విస్మరించింది. మార్గదర్శకాలకు భిన్నంగా ఇష్టారీతిన నియామకాలు చేపట్టింది. చేసేందుకు పని లేకపోవడంతో వీరిలో పలువురు అధికారుల సేవల్లో తరిస్తున్నారు. వారి ఇళ్లలో పనులు చేస్తున్నారు. జీతాలు మాత్రం ప్రభుత్వ శాఖల నుంచి పొందుతూ వస్తున్నారు.
– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

- వైకాపా ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సులు
- అడ్డగోలుగా సిబ్బంది నియామకాలు
- ఆ తర్వాత అధికారుల నివాసాల్లో పనులు
- గత ప్రభుత్వంలో నిబంధనలకు తిలోదకాలు

▶ **పాలు తెస్తారు.. వంట చేస్తారు...:** జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం(డ్వామా)లో ఆప్కాస్ కింద 200 మంది; ఎఫ్‌టీఈ(ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్) కింద మరో 400 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆప్కాస్ ఉద్యోగులకు సీనియారిటీ ఆధారంగా రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. డ్వామా పీడీ నుంచి అదనపు పీడీ, వాటర్‌షెడ్ ఏపీడీ, జిల్లా విజిలెన్స్ అధికారి, క్లస్టర్ ఏపీడీల వరకు అందరూ జిల్లా పర్యటన నిమిత్తం కార్లను ఒప్పంద ప్రకారం నెలవారీ అద్దె ప్రాతిపదికన తీసుకుంటారు. డ్వామా కార్యాలయంలో మొదటి నుంచీ ప్రభుత్వ పరంగా కార్లే లేవు. అయినా ఇక్కడ రెండు డ్రైవర్ పోస్టులను భర్తీ చేశారు. సదరు డ్రైవర్లను పొరుగు సేవల కింద ఎంపిక చేసి కలెక్టరేట్‌కు కేటాయించారు. ఎఫ్‌టీఈ కింద ఎంపిక చేసిన ముగ్గురు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సహాయకులుగా కొనసాగుతున్నారు. సంయుక్త కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మరో ఇద్దరు పనిచేస్తున్నారు. డ్వామా పీడీ ఇంట్లోనూ ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా డ్వామా నుంచి జీతం పొందుతున్నా.. అధికారుల ఇళ్లకు మార్కెట్ నుంచి పాలు, కూరగాయలు తేవడం; వంట తయారీ, ఇతరత్రా పనులే చేస్తున్నారన్న విమర్శలున్నాయి. శ్రీశైలం ప్రాజెక్ట్ కింద యర్రగొండపాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లోని ఆయా కార్యాలయాల్లోనూ మరో 20 మంది ఇదే తీరున విధులు నిర్వహిస్తున్నారు.



▶ **పని కాదు.. పెత్తనం చేస్తారు...:** పేరుకు వారు పారిశుద్ధ్య కార్మికులే అయినా ఎప్పుడూ పార పట్టరు.. తట్ట ఎత్తరు. విధులకూ హాజరు కారు. మేస్త్రీ హోదాలో చెలామణి అవుతూ మిగతా వారిపై మాత్రం పెత్తనం చెలాయిస్తున్నారు. వీరికి ఒంగోలు నగరపాలక సంస్థ మాత్రం ప్రతి నెలా ఠంచనుగా జీతం చెల్లిస్తుంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడ్డగోలు వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత వైకాపా ప్రభుత్వంలో 106 మందిని అడ్డగోలుగా నాటి వైకాపా ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సులతో నియమితులైనట్లు ప్రాథమికంగా గుర్తించింది. వీరిలో కొందరు సదరు నాయకుల నివాసాల్లో పనులు చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ విషయమై ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తాము పార పట్టలేమంటూ ఇరవై మంది వరకు స్వచ్ఛందంగా తప్పుకొన్నట్లు సమాచారం. గిద్దలూరు నగర పంచాయతీలోనూ వైకాపా హయాంలో పది మంది వరకు పారిశుద్ధ్య కార్మికులుగా నియమితులయ్యారు. వీరంతా వైకాపా కౌన్సిలర్ల నివాసాల్లో పనిమనుషులుగా, కారు డ్రైవర్లుగా పనిచేస్తూ ప్రభుత్వం నుంచి జీతాలు పొందారు. ఈ విషయమై 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో వారందరినీ అధికారులు వెనక్కి పిలిచారు.

నల్లమలకు కుంకీ ఏనుగులు!


▶ అడవి దున్నల పరిరక్షణకు చర్యలు



నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలోని నల్లమలకు త్వరలో కుంకీ ఏనుగులు రానున్నాయి. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో గస్తీకి ఉపయోగిస్తున్న వాటిల్లో కొన్నింటిని ఇక్కడికి రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఆ రాష్ట్ర అటవీ శాఖా మంత్రి ఈశ్వర్ బి.ఖండ్రేతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే చర్చించారు.
– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం, పెద్ద దోర్నాల

▶ **యాభై హెక్టార్లలో ఎన్‌క్లోజర్..!:** గిద్దలూరు అటవీ శాఖ డివిజన్ పరిధిలో అడవి దున్న(గార్)ల కదలికలు ఇటీవల ట్రాప్ కెమెరాల్లో నమోదయ్యాయి. దీంతో వీటి పరిరక్షణకు గిద్దలూరు అటవీ శాఖ డివిజన్‌ను ఆనుకుని ఉన్న నంద్యాల డివిజన్ గుండ్లబ్రహ్మేశ్వర అటవీప్రాంతంలో 50 హెక్టార్లలో ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ మేరకు దిల్లీలోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు నెల రోజుల పాటు నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ఇప్పటికే పర్యటించారు. గార్ నివాసానికి అనుకూలమైన వాతావరణం ఉందా లేదా అని పరిశీలించి కేంద్రానికి నివేదికలను అందజేసినట్లు సమాచారం.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి



శ్రీశైలం, నల్లమలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారు. అందుకోసం రూ.100 కోట్ల వరకూ నిధులు ఖర్చు చేయనున్నారు. అందులో భాగంగా పర్యాటక శాఖకు సలహాదారుడిగా పనిచేస్తున్న కె.లక్ష్మీనారాయణ శ్రీశైలం, పెద్ద దోర్నాల అటవీ ప్రాంతాల్లో ఇటీవల పర్యటించారు. శ్రీశైలంలో మైథిలాజికల్ థీమ్ పార్కు, పెద్దదోర్నాలలో అడ్వెంచర్ పార్కు, అటవీ ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అటవీ శాఖ అధికారులతో చర్చిస్తున్నారు.

గిరిజన గ్రామాలకు మహర్దశ



చింతల చెంచు గిరిజన గూడెం ముఖచిత్రం

గిరిజన గ్రామాలు నేటికీ అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. సరైన రహదారులు ఉండవు.. వైద్య సౌకర్యాలు కరవు.. పక్కా గృహాల సంగతి సరేసరి. నల్లమల అటవీ ప్రాంతంలో ఇటువంటి చెంచు గిరిజన గూడేలు, గిరిజనులు నివాసం ఉంటున్న మైదాన ప్రాంతాలు బోలెడు. ఈ నేపథ్యంలో పీఎం జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద వాటిల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రాష్ట్రంలో 878 గ్రామాలు ఆ పథకం కింద ఎంపికవ్వగా.. జిల్లాలో 16 ఉన్నాయి. – న్యూస్‌టుడే, పెద్దదోర్నాల



▶ **ఎంపికైంది ఏ ఏ ఊళ్లంటే...:** యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోని గ్రామాలను పీఎం జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు.

ఇవీ చేపట్టే పనులు...

పథకం కింద ఎంపికైన గ్రామాల్లో అనుసంధాన రహదారులు, అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మిస్తారు. రక్షిత నీరు అందిస్తారు. సౌర విద్యుత్తు, వైద్య సౌకర్యాలు కల్పిస్తారు. పక్కా గృహాల నిర్మాణం చేపడతారు. గ్యాస్ కనెక్షన్లు, టెలిఫోన్, పాఠశాల, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మహిళలు, యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తారు. త్వరలో ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు తెలిపారు.

మండలం	గ్రామాలు
యర్రగొండపాలెం	పాలుట్ల, అల్లిపాలెం, గుట్టలచెరువు, వెంకటాద్రిపాలెం, మిల్లంపల్లె, యర్రగొండపాలెం, దద్దనాల, ఆమానిగుడిపాడు, గుర్రపుశాల, గోళ్లవిడిపి
పెద్దదోర్నాల	తుమ్మలబైలు, చింతల, నల్లగుంట్ల గూడెం, చిలకచెర్ల గూడెం
పుల్లలచెరువు	మురికిమల్ల పెంట, గారపెంట

ఉపాధిలో ప్రజోపయోగ పనులకు పెద్దపీట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల గుర్తింపునకు అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు ప్రకాశం భవన్ నుంచి మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూడికతీత పనులకు ప్రాధాన్యం తగ్గించి, దీర్ఘకాలికంగా ప్రజలకు ప్రయోజనం కలిగించే వాటికి పెద్దపీట వేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వాస్తవ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అర్జీలు పరిష్కరించకుండా కలెక్టరేట్‌లో ఉందంటూ తప్పుదోవ పట్టించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సూచనలు, సలహాలిచ్చే సర్వేలో ప్రజలు పాల్గొనేలా చూడాలని ఎంపీడీవోలకు సూచించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, సీపీవో వెంకటేశ్వర్లు, ఎస్డీసీ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, ఎస్డీసీ లోకేశ్వరరావు

ప్రకాశానికి కావాలి రక్తం

▶ నానాటికీ తగ్గిపోతున్న దాతలు ▶ ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు ▶ రోజువారీ అవసరం 120 యూనిట్లు

▶ పల్లెపాలెం గ్రామానికి చెందిన నిండు గర్భిణి. ఒంగోలు నగరం గుంటూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పురిటి నొప్పులతో చేరారు. రక్తహీనత ఉన్నందున రెండు యూనిట్ల రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. ఏబీ నెగిటివ్ గ్రూపు కావడంతో జిల్లాలో ఎక్కడా దొరకలేదు. ఆ ఆసుపత్రి అధినేత అయిన డాక్టర్‌ది ఆమె ఊరే కావడం.. అతనిదీ అదే గ్రూపు కావడంతో తానే రక్తదాతగా మారారు.

▶ ఒంగోలు నగరంలోని గద్దలగుంటకు చెందిన సుబ్బారావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రక్తం అధికంగా పోవడంతో రెండు యూనిట్లు అత్యవసరంగా ఎక్కించాల్సి వచ్చింది. సమయానికి ఆ గ్రూపు రక్తం లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు బెంగళూరులో లభ్యమవుతున్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి తెచ్చారు. అప్పటివరకు కాలికి చేయాల్సిన శస్త్రచికిత్సను వాయిదా వేయాల్సి వచ్చింది.
– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ప్రభుత్వ ఆసుపత్రులు	70
ప్రైవేట్ ఆసుపత్రులు	80
రోజువారీ అవసరమైన రక్తం	120 యూనిట్లు
ప్రస్తుతం అందుబాటులో ఉన్నది:	60-80 యూనిట్లు
నమోదైన స్వచ్ఛంద దాతలు:	300
ఏడాదిలో నిర్వహిస్తున్న శిబిరాలు:	25(సుమారు)

జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల్లో తగినంత రక్తనిల్వలు లేవు. అవసరమైన సమయంలో ఎంతో మందికి అన్వేషించాల్సిన పరిస్థితులు తప్పడం లేదు. ఓ వైపు రక్తదానం చేసేవారి సంఖ్య పెరగడం లేదు. మరోవైపు అవసరార్థుల సంఖ్య పెరిగిపోతోంది. రక్తహీనత మహిళల ప్రసవ సమయంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం వస్తుందో ఊహించలేము. తప్పనిసరిగా రక్తం అందుబాటులో ఉంచాల్సిందే. ఆర్థిక స్తోమత ఉన్నవారు దూరప్రాంతాల నుంచి కష్టపడి తెస్తుండగా.. పేదల వెతలు వర్ణనాతీతం. సకాలంలో లభించక మృత్యువాత పడిన సందర్భాలూ లేకపోలేదు.



పెరుగుతున్న బాధితులు...

జిల్లాలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లలు 50 మంది., సికెల్‌సెల్ సమస్య బాధితులు మరో ఇద్దరున్నారు. క్యాన్సర్ రోగులకూ కొన్ని సందర్భాల్లో రక్తం అవసరమవుతుంది. తలసేమియా, సికిల్‌సెల్ వారికి ఏ బ్లడ్‌బ్యాంకులోనైనా ఉచితంగా ఇస్తున్నప్పటికీ.. కొన్ని సందర్భాల్లో అన్ని గ్రూపులు లభ్యం కాని పరిస్థితి. ప్రతినెలా రక్తం ఎక్కించుకుంటేనే తలసేమియా బాధితుల ప్రాణాలు పదిలంగా ఉంటాయి. వీరే కాకుండా రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. మహిళలకు 12.5 శాతం ఉండాలి. గిరిజన ప్రాంతాలు, పేదవర్గాల్లోని మహిళల్లో 7 నుంచి 8 శాతం ఉంటోంది. దీంతో ప్రసవ సమయంలో రక్తం తప్పనిసరి అవుతోంది.



బ్లడ్‌బ్యాంకులో రక్తనిల్వలు

ఏడాది పొడవునా లభ్యం కాని నిల్వలు...

జిల్లాలో స్వచ్ఛందంగా కొందరే రక్తదానం చేస్తున్నారు. కళాశాలల్లో శిబిరాలు, ఇతరత్రా కార్యక్రమాల సమయంలో మరి కొందరు అందిస్తున్నారు. ప్రమాద బాధితులు, ప్రసవాలతో పాటు తప్పనిసరిగా అవసరమైన రోగులకు కలిపి జిల్లాలో రోజువారీ సరాసరిన 120 యూనిట్ల రక్తం అవసరమవుతోంది. కొన్ని సీజన్లలో కొరత లేకుండా లభ్యమవుతుండగా, కళాశాల విద్యార్థులకు సెలవులు ఇచ్చినప్పుడు, వేసవిలో తీవ్ర కొరత ఏర్పడుతోంది. ఏడాది పొడవునా తగినంత నిల్వలు ఉండేలా ప్రణాళిక ప్రకారం శిబిరాలు నిర్వహిస్తేనే ఫలితం ఉంటుందని వైద్యులంటున్నారు.

పుడమికి చీరలే సారెలా.. బిందువులే ఇంధనంలా..





నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో చెందిన కావూరి లాజర్ పొగాకు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఎకరా పొలంలో వేసిన పొగ నారును నిత్యం తడి అందించేందుకు ఎండు గడ్డి పరవాలి. అయితే ట్రక్కు గడ్డి రూ.20 వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఒంగోలులో పాత చీర ఒక్కోటి రూ. 30కు కొనుగోలు చేసే ఇలా పరచడంతో ఖర్చు తగ్గిందన్నారు. ఎకరాకు బిందు సేద్యం ద్వారా నీరందిస్తూ కాపాడుకుంటున్నారు.

-ఫొటోలు: ఈనాడు, ఒంగోలు



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది, వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, సిబ్బంది వాటి పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా 227 వినతులొచ్చాయి. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఎస్‌డీసీలు వరకుమార్, లోకేశ్వరరావు, కుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార చిట్టీలపై కఠిన చర్యలు

▶ జిల్లా ఎస్పీ దామోదర్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో అనధికార చిట్టీల నిర్వహణ, ప్రైవేటు ఫైనాన్స్ కార్యకలాపాలను సహించేది లేదని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరించారు. దీనికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 97మంది తమ వినతులు అందజేశారు. వీటిలో ఆర్థిక వివాదాలే ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ఎస్పీ స్పందిస్తూ చిట్టీలు, ఫైనాన్స్ నిర్వహించే వారు ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆర్థిక లావాదేవీలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైమ్స్) శ్రీధర్‌రావు, అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ దామోదర్

తీర ప్రాంత అభివృద్ధికి కృషి

ఒంగోలు నగరం, టంగుటూరు, న్యూస్‌టుడే: మారిటైం బోర్డుకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తానని తెదేపా నేత, దామచర్ల సత్య అన్నారు. మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం దిల్లీ హైవే సమావేశ మందిరంలో ఆయన్ని యోగా మిత్రమండలి, చేయూత సేవా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యోగా మిత్రమండలి ప్రతినిధి తాతా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్య మాట్లాడుతూ నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు అందించే చేయూత సంస్థలో తాను భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉందన్నారు. మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా ఈ నెల 5న బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. రాష్ట్రంలో 980 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండటం వల్ల భవిష్యత్తులో ఎంతో అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. కొత్తగా అయిదు పోర్టులు, 14 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. యోగా మిత్రమండలి అధ్యక్షులు శిద్దా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చేయూత సేవాసంస్థకు సత్య రూ.లక్ష సాయం అందించి వృద్ధుల సంక్షేమానికి దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో శ్రీహర్షిణి కళాశాల అధినేత గోరంట్ల రవికుమార్, ఢాకా అంజిరెడ్డి, యోగా గురువు ఆంజనేయులు, శేషాచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మారిటైం బోర్డు ఛైర్మన్ సత్యను సత్కరిస్తున్న యోగా మిత్రమండలి ప్రతినిధులు

వట్టివేర్ల సాగు... లాభాలు బాగు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే:



ఇసుక నేలల్లో సిరులు పండిస్తున్నారు కొత్తపట్నం మండలం పూరిణి పాలెం గ్రామానికి చెందిన రైతు పూరిణి బాలకృష్ణ. వినూత్న రీతిలో వట్టివేర్లను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు డిమాండ్ పెరగడం, కొన్ని పరిశ్రమలు కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో మరికొందరు రైతులు పంట సాగుకు సిద్ధమవుతున్నారని ఆయన చెబుతున్నారు.

▶ 10 ఎకరాల్లో ప్రారంభించి..: రైతు బాలకృష్ణ మొదట్లో ఇసుక నేలల్లో సీమ, కంద వంటి పంటలు సాగు చేశారు. వాటికి స్థిరమైన ధరలేక నష్టపోయారు. ఏడాదిన్నర కిందట పంట మార్పిడికి బాగుగా ప్రయోగాత్మకంగా వట్టివేర్ల సాగుకు శ్రీకారం చుట్టారు. తొలి ప్రయత్నంలో 10 ఎకరాల్లో పంట వేశారు. ముందుగా ఎరువుల కంపెనీల విత్తనాలు అందించారు. విత్తిన ఏడు నెలలకు పంట చేతికొచ్చింది. మొక్క పెరిగిన తరువాత ప్రతి రెండు నెలలకోసారి వేర్లను పరిశీలించారు. పొలంలో పైపులు వేసి తుంపర సేద్యం ద్వారా నీరు అందించారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు మేరకు పది రోజులకోసారి పురుగు మందులు పిచికారీ చేశారు. పంట కోత సమయంలో మాత్రం జేసీబీతో మొక్కలను తీశారు. పరిమిత సంఖ్యలోనే ఎరువులను వినియోగించారు. ఎకరానికి రెండు టన్నులు పైగా దిగుబడి వస్తుందని, ఖర్చులన్నీ పోను రూ.60 వేల నుంచి రూ. 70 వేల వరకు లాభాలు పొందవచ్చని రైతు చెబుతున్నారు. మంచి ఆదాయం లభించడంతో ప్రస్తుతం 23 ఎకరాల్లో పంట సాగును చేస్తున్నానని తెలిపారు. మొత్తం పంటను రెండు ఎకరాల విస్తీర్ణంలో బిట్టి, బిట్టిగా వేస్తే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని బాలకృష్ణ వివరిస్తున్నారు.

▶ విరివిగా వినియోగం..: ప్రస్తుతం సుగంధ ద్రవ్యాల్లో వినియోగించే వట్టివేరు తైలానికి మంచి డిమాండ్ ఉంది. ఈ తైలం మంచి ఔషధ గుణాలు కలిగి ఉండటంతో పాటు, సువాసనలు వెదజల్లుతుంది. వట్టివేరును సాధారణంగా కూలర్లు, చల్లదనాన్ని ఇచ్చేందుకు ఇంటి కిటికీలు, తలుపుల వద్ద వినియోగించే చాపలు, దేవుడికి వేసే మాలల్లో వీటిని ఉపయోగిస్తుంటారు. ఈ పంట ఎవరైనా సాగు చేయాలని భావిస్తే రెండు, మూడు ఎకరాల్లో కాకుండా పది ఎకరాల్లో పంట వేయాలని.. అప్పుడు లాభాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని ఆ రైతు చెబుతున్నారు.

సమస్య పరిష్కారం

▶ సమస్య: మా గొర్రె పిల్లలు మట్టి నాకుతూ తరచూ పారుడు న్నాయి. ఏమి చేయాలి? -ఎం.నారాయణ, కొండపోయనపల్లి

సమాధానం: గొర్రె పిల్లలు మట్టి నాకకుండా ఉండేందుకు కొట్టంలో ఖనిజలవణ మిశ్రమ రాళ్లను వేలాడదీయాలి. పారుతున్న గొర్రెపిల్లలను వేరుచేసి పశు వైద్యాధికారి సలహాతో యాంటీ బయాటిక్ పొడి మందు వాడాలి.



షేక్ మునీర్, పశువైద్యాధికారి దేజీపేట


▶ సమస్య: గేదె నుంచి ఏడాదికి ఒక దూడను పొందాలంటే ఏం చేయాలి. - సి.హెచ్.ప్రసాద్, చెన్నపునాయునిపల్లి.

సమాధానం: ఏడాదికి ఓ దూడను పొందాలంటే గేదె ఈదిన 60 రోజుల తరువాత 90 రోజుల లోపు చూలు కట్టించాలి. అప్పుడు ఏడాదికి ఒక దూడను పొందవచ్చు. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

రైతేరాజు

వాతావరణ మార్పులు.. కావాలి జాగ్రత్తలు

జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు పడటంతో పాటు ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఆయా రకాల పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి దర్శి కేవీకే సమన్వయ కర్త డా.రమేష్ వివరిస్తున్నారు ఇలా...



▶ ఇటీవల కురిసిన వర్షాలకు కంది పంటలో అక్కడక్కడ వైరస్ వల్ల వ్యాపించే వెర్రి తెగులు కనిపిస్తుంది. నివారణకు తెగులు సోకిన మొక్కలను వెంటనే తొలగించాలి. గంధకం మందును ఎకరాకు 600 గ్రాములు చొప్పున నీటితో కలిపి పిచికారీ చేయాలి.

▶ ఆలస్యంగా వరి నాట్లు వేయటం వల్ల ఉల్లి కోడు తెగులు ఎక్కువగా ఆశించింది. దీన్ని సరైన సమయంలో నివారించకపోతే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నివారణకు నాట్లు వేసిన వెంటనే కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరానికి 10కిలోల చొప్పున చల్లించాలి.

▶ మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఎక్కువగా ఆశించింది. నివారణకు ప్రొక్లైమ్ పురుగు మందును ఎకరానికి 10 గ్రాముల చొప్పున నీటితో ఆకుల సందుల్లో పడేలా పిచికారీ చేయాలి.

▶ ఇటీవల కురిసిన వర్షాలకు పలువురు రైతులు మిరప నాట్లు వేస్తున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా మిరపలో వచ్చే వేరు, రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చు. నాట్లు వేసే సమయంలో 10 లీటర్ల నీటిలో 5-10 మి.లీ. కాన్ఫిడార్, 20 గ్రాములు బావిస్టిన్ కలిపి మిరప నారు వేళ్లను ముంచి నాటుకోవాలి. – న్యూస్‌టుడే, దర్శి

మీ కోసం

పసుపు.. సస్యరక్షణతో మేలు

పసుపు దీర్ఘకాలిక పంట. గతేడాది దీనికి మంచి ధరలు రావడంతో ఈ ఏడాది పశ్చిమ ప్రకాశంలో రైతులు విస్తారంగా సాగు చేశారు. ఈ పంటలో తగిన చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ వివరిస్తున్నారు ఇలా.. –న్యూస్‌టుడే, కంభం

▶ పోషక లోపాలు: పసుపు ఆకుల అంచులు ఎండి పోవడాన్ని పొటాష్ లోపంగా గుర్తించవచ్చు. నివారణకు లీటర్ నీటికి 10 గ్రాముల మల్టికే గానీ, పరీమాక్స్ లాండ్ పోషకాలను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఇనుపధాతు లోపం వల్ల ఆకు మధ్యభాగం తెల్లగా మారుతుంది. లీటర్ నీటికి 5 గ్రాములు ఫెర్రస్ సల్ఫేట్‌ను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింకు ధాతు లోపం ఉంటే ఆకు మధ్య భాగం లేత ఆకుపచ్చ రంగుకు మారుతుంది. నివారణకు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చల్లుకోవాలి.

▶ దుంప ఈగ: ఇది కాండం తొలుస్తూ, అంతర్గతాన్ని తింటూ.. మలినాలను బయటకు పంపిస్తుంది. దీనివల్ల ఆకులపై వరుస రంధ్రాలు ఏర్పడతాయి. నివారణకు 10 కిలోల 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి. లీటర్ నీటికి 1 మి.లీ డైమిథోయేట్ కానీ, 1 మి.లీ. ప్రొఫెనోఫాస్‌ను పిచికారీ చేసుకోవాలి.



▶ అల్లిక రెక్కనల్లి: ఈ కీటకాలు ఆకుల అడుగు భాగంలో తల్లి, పిల్ల పురుగులుగా ఉండి రసం పీల్చడం వల్ల ఆకు పైభాగాన తెల్లని మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటర్ నీటికి రెండు మి.లీ డైమిథోయేట్ గానీ, 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ కానీ పిచికారీ చేసుకోవాలి.

▶ తాటాకు మచ్చతెగులు: ఆకులపై పెద్ద అండాకారపు మచ్చలు పెరిగి ముదురు గోధుమ రంగులో ఉంటాయి. నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్ కానీ, 1 గ్రాముల కార్బండింజమ్, 2.5 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

రాష్ట్ర జట్లలో జిల్లా క్రికెటర్లకు స్థానం

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అండర్-19, 23 వయస్సు విభాగాల క్రికెట్ జట్లకు జిల్లాకు చెందిన పలువురు ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జి.సుమిత్ అండర్-23 జట్టుకు ఎంపిక కాగా, ఎం.లేఖజ్‌లెడ్డి, పి.నవీన్ స్టాండ్ బైగా వ్యవహరించనున్నారు. కె. సాత్విక్, కె. ఆనంద్ జోషయ్య అండర్-19 జట్టులో స్థానం సంపాదించినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్(పీడీసీఏ) అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. అండర్-19, 23 జట్ల ప్రాబబుల్స్‌కు నిర్వహించిన పోటీల్లో వీరు చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్లలో స్థానం కల్పించినట్లు చెప్పారు. వారికి పీడీసీఏ సభ్యులతో పాటు ఏసీఏ కోచ్‌లు సుధాకర్, చంద్రశేఖర్, మహిళా జట్టు కోచ్ చంద్రిక అభినందనలు తెలిపారు.



జి.సుమిత్



పి.నవీన్



కె.సాత్విక్



కె.ఆనంద్ జోషయ్య



ఎం.లేఖజ్‌రెడ్డి

భైరవకోన ఈవోగా వంశీకృష్ణారెడ్డి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పవిత్ర శైవ పుణ్యక్షేత్రం భైరవకోన కార్యనిర్వహణాధికారిగా డి.వంశీకృష్ణారెడ్డి సోమవారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌ఛార్జి ఈవోగా కొణిజేడు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న నర్రా నారాయణరెడ్డి పనిచేశారు. కలవళ్ల గ్రూపు దేవస్థానాల గ్రేడ్-1 ఈవోగా పనిచేస్తున్న వంశీకృష్ణారెడ్డి బదిలీపై భైరవకోన వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఈవో మాట్లాడుతూ భైరవకోన అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

నూతన డీఈవోగా వెంకటేశ్వర్లు!

ఒంగోలు నగరం: జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా నరసరావుపేట ఇన్‌ఛార్జి డీఈవో మాదిగాని వెంకటేశ్వర్లు నియమితులు కానున్నారు. మంగళవారం అధికారిక ఉత్తర్వులు వస్తాయని విశ్వసనీయ సమాచారం. అదే విధంగా ఒంగోలు ఇన్‌ఛార్జి ఉప విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న సామా సుబ్బారావును పల్నాడు డీఈవో, నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌ను బాపట్ల డీఈవోగా నియమిస్తున్నట్లు సమాచారం. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పోస్టుకు ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, గుంటూరు జిల్లాకు చెందిన మరొకరి పేరు పరిశీలనలో ఉన్నాయి.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

వెలిగొండ పూర్తితోనే జిల్లా అభివృద్ధి

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించి వెంటనే పూర్తి చేస్తేనే జిల్లా అభివృద్ధి చెందుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య అధ్యక్షతన జరిగాయి. అనంతరం మార్కాపురం కోర్టు కూడలిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందుగా స్వార్థపూరిత ఆలోచనలతో నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందుగా ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యముందని ప్రకటించినా, నేటికీ ఎలాంటి పనులు చేపట్టడం లేదన్నారు. తక్షణమే నిర్వాసితులకు పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, మస్తాన్, వి.ఆంజనేయులు, ఉబ్బా వెంకటేశ్వర్లు, నాగరాజు, కాశయ్య, వై.ఏసు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో వ్యకాస నేతలు, కార్యకర్తల ఆందోళన

సెక్యూరిటీ గార్డుకు గౌరవ డాక్టరేట్

▶ నాటక రంగంలో సేవలకు గుర్తింపు

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి పాతగొల్లపాలెం గ్రామానికి చెందిన తాను నాటక రంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చర్ రీసెర్చి యూనివర్సిటీ వారు తమిళనాడులోని హోసూరులో శనివారం డాక్టరేటు ఇచ్చారని మద్దిన ఏడుకొండలు సోమవారం తెలిపారు. బీఎస్సీ చదివిన తాను ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలో సిద్ధయ్య పాత్ర ద్వారా 150 ప్రదర్శనలు, సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడు, చింతామణిలో సుబ్బిశెట్టి వేషాలతో ప్రదర్శనలు ఇచ్చానని వివరించారు. దీనికి గుర్తింపుగా డాక్టరేటు ఇచ్చారని తెలిపారు.



నిర్వాహకుల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న ఏడుకొండలు

చిరు తగాదాలే ఉసురు తీశాయి..

▶ వేర్వేరుచోట్ల ఇద్దరి బలవన్మరణం

దర్శి, న్యూస్‌టుడే: చిన్నపాటి వివాదాలకే మనస్తాపానికి గురై వేర్వేరుచోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలు ఆదివారం రాత్రి చోటు చేసుకోగా, సోమవారం వెలుగులోకి వచ్చాయి. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు.. దర్శి మండలం లంకోజనపల్లికి చెందిన కల్లూరి శ్రీను (32) వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. పదమూడేళ్ల క్రితం స్థానికంగా ఉండే కుమారితో ఆయనకు వివాహమైంది. గత కొంతకాలంగా వారి నడుమ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మళ్లీ వివాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన శ్రీను కొత్తగా కట్టుకుంటున్న ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలపగా, వారు శ్రీనును దర్శిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి సోదరుడు వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కల్లూరి శ్రీను మృతదేహం

మనస్తాపంతో వివాహిత..

బేస్తవారపేట, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని సింగరపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కామునూరి వెంకటరమణ మద్యానికి బానిసై భార్య వెంకటరమణమ్మ(40)తో తరచూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రమణమ్మ ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో స్నానపు గదిలోకి వెళ్లి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొద్ది సేపటి తర్వాత ఇంటికొచ్చిన కుటుంబసభ్యులు స్నానపు గదిలో అపస్మారక స్థితిలో పడివున్న ఆమెను గుర్తించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

నకిలీ పట్టాలతో మోసం

మార్కాపురం, న్యూస్‌టుడే: ఓ మహిళకు నకిలీ పట్టాలిచ్చి మోసంచేసిన వ్యక్తిని అరెస్టు చేసి మార్కాపురం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. మార్కాపురం పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన రావూరి సరిత బాపూజీ కాలనీలోని చెందిన రెడ్డెపోగు గురవయ్యకు రూ.25 లక్షలు చెల్లించగా, మార్కాపురం, కంభం నకిలీ స్థలాలు అంటగట్టారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులు సోమవారం గురవయ్యను అరెస్టు చేసి మార్కాపురం కోర్టులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కిషోర్‌కుమార్ ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.

లారీ యజమాని అనుమానాస్పద మృతి

పామూరు, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ లారీ యజమాని మృతిచెందారు. ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు. పామూరు విద్యుత్తు కార్యాలయ కాలనీ 4వ లైన్‌లో నివాసముంటున్న సిద్ధవటం వెంకటేశ్వర్లుకు సొంత లారీ ఉంది. ఆయనే చోదకుడిగా ఉంటూ బాడుగలకు వెళుతుంటారు. సోమవారం స్థానిక 167-బి జాతీయ రహదారి అంచున లారీ నిలిపి ఉండగా, దాని పక్కనే వెంకటేశ్వర్లు(46) మృతదేహం పడివుంది. ఉదయం నడకకు వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి కాళ్లు, మెడకు తాళ్లతో కట్టిన గుర్తులున్నాయి. ఆ తాళ్లను లారీ క్యాబిన్‌లో కొక్కేనికి చుట్టి ఉంది. దీనిపై మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు చేయగా, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం.భీమానాయక్ పరిశీలించి మృతుడి భార్యతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఆయనకు కొంతమేర అప్పులున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చురుగ్గా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. వైస్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైకాపా, తెదేపాకు చెందిన కౌన్సిలర్లు పలు సమస్యలపై గళమెత్తారు. ఇరుపక్షాల వాదోపవాదాలు చోటుచేసుకోవడంతో కాసేపు కౌన్సిల్ సమావేశం వేడెక్కింది. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఎస్.కె.ఇస్మాయిల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో పనిచేస్తున్న 20మంది పైగా కార్మికులను తొలగించారన్నారు. దీనిపై తెదేపా కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలోనూ కొంతమంది కార్మికులను కారణం లేకుండా తొలగించిన విషయం మీకు గుర్తుకు రాలేదా.. అని ప్రశ్నించారు. దీంతో సమావేశంలో కొంత సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. నీటి ట్యాంకర్ల కేటాయింపు విషయంలోనూ ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని వైస్ ఛైర్మన్‌తో పాటు వైకాపాకు చెందిన కౌన్సిలర్లు ప్రశ్నించారు. పట్టణంలో ఆవులు, కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని ఛైర్మన్, అధికారులపై వైకాపా కౌన్సిలర్లు మండిపడ్డారు. కౌన్సిల్ అజెండాలోని ఉన్న 12 సమస్యలకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఏఈ ఆదినారాయణ, మేనేజర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



వైస్‌ఛైర్మన్ ఇస్మాయిల్, తెదేపా కౌన్సిలర్ కొండయ్య మధ్య వాదోపవాదాలు

వరద బాధితులకు ఆర్థికసాయం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేకరుల ద్వారా సేకరించిన రూ.50వేలను సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.మోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి చెక్కును అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

అనధికార లేఅవుట్లపై చర్యలకు డిమాండ్

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలో పుట్టుకొస్తున్న అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని వైకాపా జిల్లా నాయకులు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

బేస్తవారపేట: దసరా పండుగ సందర్భంగా బేస్తవారపేటలోని స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలోని క్రీడ ప్రాంగణంలో హరి ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో నేటి నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గుంతలతో ప్రమాదభరిత ప్రయాణం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు-కొమరోలు రహదారిలోని గిద్దలూరు నుంచి నరవ వరకు రహదారిలో పలు చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా మారాయి. గతంలో ఉన్న గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చినప్పటికీ మళ్లీ పలు చోట్ల రహదారి మధ్యలో అందులో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాల వెలుతురుకు గుంతలు కనిపించిక ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో ఈ గుంతల్లో నీరు చేరి కనిపించిక ద్విచక్రవాహన చోదకులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ గుంతలను పూడ్చాలని వాహన చోదకులు కోరుతున్నారు.



గిద్దలూరు-నరవ రహదారిపై ఏర్పడిన గుంతలు

రక్తదానం.. ప్రాణదానం

స్వచ్ఛందగా ముందుకు వస్తున్న యువత



రక్తం ఇస్తున్న యువకేర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

రక్త దానంతో ఓ కుటుంబాన్ని నిలబెట్ట వచ్చునన్న ఆలోచనతో నేటి యువత ముందుకు కదులుతోంది. తమ సేవల్లో రక్తదానానికి ప్రాధాన్యమిస్తోంది. ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఇవ్వడమే కాక, ఇచ్చేలా ప్రోత్సహించడానికి ప్రాధాన్యమిస్తోంది. పలు మార్లు రక్తదానం చేయడమే కాక, బృందంగా ఏర్పడి పలువురికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా సేవా పథకంలో ముందుకు వెళ్తున్న యువతపై ప్రత్యేక కథనం.

ఒక్కడితో మొదలై....

మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్‌కె. మహమ్మద్ ఆరీఫ్ ఉద్దీన్ గన్నవరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో సీనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇంజినీరింగ్ చదువుకునే రోజుల్లో స్నేహితులతో కలిసి యువకేర్ వెల్ఫేర్ సొసైటీని స్థాపించి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం సేవా సంస్థలో 3,000 సభ్యులు ఉన్నారు. వీరి సాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రామాల నుంచి నగరాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్న రోగులకు సభ్యులు రక్తదానం చేస్తున్నారు. రక్తదానంపై అవగాహన సదస్సులు నిర్వహించడం, లఘుచిత్రాల ద్వారా రక్తదానం ఆవశ్యతను తెలియజేయడం, ప్రాజెక్టర్ల సాయంతో అవగాహన సదస్సులు నిర్వహించి పేద వారికి అండగా నిలుస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, గుంటూరు, విజయవాడ, నంద్యాల, కర్నూలు తదితర ప్రాంతాల్లో 3,000 మందికి పైగా యువకేర్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రక్తదానం చేశారు.



హైదరాబాద్‌లో రక్తం ఇస్తున్న యువకేర్ సేవా సైనికుడు

సామాజిక బాధ్యతగా...

ఇంజినీరింగ్ చదివే రోజుల్లోనే రక్తదానం విలువ తెలుసుకున్నా. పలు సేవా కార్యక్రమాలను స్నేహితులు చేపట్టే సమయంలో రక్తదానం విలువను అందరికీ తెలియజేయాలనిపించింది. ఉద్యోగంలో చేరాక స్నేహితులతో కలిసి యువకేర్ సంస్థపే8 నెలకొల్పి రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా. మా సభ్యులు రక్తదానం చేస్తూ, చేపించేలా చూస్తూ ముందుకెళుతున్నాం. పేదలకు అండగా నిలుస్తున్నాం. – ఎస్‌కె.ఆరీఫ్ ఉద్దీన్



బాధ్యతల స్వీకరణ

కంభం, మార్కాపురం, గిద్దలూరు పట్టణం, కొమరోలు గ్రామీణం, పొదిలి, పుల్లలచెరువు : కంభం ఎక్సైజ్ సీఐగా ఎస్. కొండారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గిద్దలూరులో పనిచేస్తూ బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. ● మార్కాపురం ఎక్సైజ్ శాఖ సీఐగా ఎం.వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ఏసీ విజిలెన్స్, ఒంగోలులో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.● గిద్దలూరు నగర పంచాయతీ ఏఈగా రవీంద్ర సోమవారం విధుల్లో చేరారు. మార్కాపురంలో పనిచేస్తూ బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చారు. గిద్దలూరు పట్టణ ప్రణాళికా విభాగం అధికారిగా ఎన్.శాంతి బాధ్యతలు స్వీకరించారు. ● కొమరోలు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ● పొదిలి సర్కిల్ ఎక్సైజ్ సీఐగా టి. అరుణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నరసరావుపేట టాస్క్‌ఫోర్సులో పనిచేస్తూ బదిలీపై పొదిలి వచ్చారు. ● పుల్లలచెరువు మండల ఎంపీడీవోగా వసంత్ నాయక్ సోమవారం విధుల్లో చేరారు.

ముగిసిన పోషకాహార మాసోత్సవాలు

మార్కాపురం, బేస్తవారపేట, గిద్దలూరు పట్టణం, పొదిలి, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో రక్త హీనతను నివారించవచ్చని ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. సోమవారం మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా భారీ స్థాయిలో పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ను ఉప కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుశీలాదేవి, డీఎల్‌పీవో భాగ్యవతి, డీఎల్‌డీవో సాయికుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బేస్తవారపేటలోని మండల పరిషత్తు కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ నీలోఫర్ ఆధ్వర్యంలో, గిద్దలూరు ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో గిద్దలూరు ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి సీడీపీవో బి.జ్యోతి ఆధ్వర్యంలో, పొదిలిలో సీడీపీవో సుధామారుతి ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాలలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు.



మార్కాపురంలో పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్

భూ సమస్యలే అధికం

మార్కాపురం : స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 30 దరఖాస్తులు వచ్చినట్లు కార్యాలయం అధికారులు తెలిపారు. ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలంటూ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీజే రాష్ట్ర కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ ధర్నా నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఉప కలెక్టర్‌కు అందజేశారు. యర్రగొండపాలెంకు చెందిన సయ్యద్ నజీర్ అహమ్మద్ తన భూ సమస్యను పరిష్కరించాలని మీ కోసంలో ఉప కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పింఛన్ కోసం..

ఈయన పేరు చిన్ననంబయ్య.. పెద్దారవీడు మండలం కన్నూతల(వెలిగొండ ముంపు ప్రాంతం). ఈయనకి ప్రస్తుతం నాలుగు వేలు పింఛను వస్తోంది. ముప్పయి రోజులు కిందట కాలుకు పుండు పడి సెప్టిక్ కావడంతో ఎడమ కాలు తీసివేశారు. గతంలో పొలం పనులకు వెళ్లేవాడినని ప్రస్తుతం వెళ్లలేని పరిస్థితి ఉందని, కుటుంబం గడవాలంటే తనకు వికలాంగుల పింఛన్ ఇప్పించాల్సిందిగా ఒంగోలులో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చి అర్జీ అందించారు. తన భార్యతో కలిసి పరిష్కార వేదిక వద్దకు ఇబ్బంది పడుతూ వెళుతున్న దృశ్యం ఇదీ. – ఈనాడు, ఒంగోలు, పెద్దారవీడు



క్విజ్ పోటీలు

యర్రగొండపాలెం పట్టణం: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008574141
పొదిలి : 8008550360

అర్థవీడు, న్యూస్‌టుడే:

?: నాగులవరం-పాపినేనిపల్లి ప్రధాన రహదారి గుంతలమయమైంది. వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మరమ్మతులు చేయించండి. – బాషా, ఆటో చోదకుడు, అర్థవీడు.

✓: రోడ్డు విస్తరణ పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. – ఆనందరావు, డీఈ ర.భ.శాఖ, కంభం.

కంభం, న్యూస్‌టుడే

?: హజరత్‌గూడెం పంచాయతీలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆరు నెలలైన వాటికి నీరు రావడం లేదు. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: చిన్నపాటి మరమ్మతులు చేయించాల్సి ఉంది. వాటిని పూర్తి చేసి కుళాయిలకు నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, జేఈ, కంభం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని ఊరు బయట ఉన్న వైద్యశాల వద్ద మురికి కాలువల్లో పూడిక తీశారు. కాలువలపై మూతలు వేయకుండా అలానే ఉంచడంతో ప్రమాదకరంగా మారాయి. కాలువలపై సిమెంట్ బల్లలు వేసి మూయించాలి. – ఆర్.ప్రసాద్, స్థానికుడు

✓: పూడిక తీసిన కాలువలను త్వరలో మూయించేసి ఇబ్బంది లేకుండా చేస్తాం.– రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

శాకాహారం.. సంపూర్ణ ఆరోగ్యం



కొమరోలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న శాకాహారులు

నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

శాకాహారంతో కూడా మెరుగైన జీవన సాగించవచ్చని శాకాహారులు పేర్కొంటున్నారు. సకల జీవులపైనా ప్రేమ కలిగి ఉండాలని తెలియజేస్తూ ప్రజల్లో శాకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. పూర్తిగా శాకాహారం తీసుకుంటూ జీవనం గడుపుతూ ఆరోగ్యకర జీవనం సాధ్యమన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం. శాకాహారంపై ప్రచారం చేస్తున్న వీరిపై కృషిపై కథనం. – కొమరోలు గ్రామీణం, కంభం, న్యూస్‌టుడే

దేహానికి ఎంతో మేలు



20 ఏళ్లుగా శాకాహారం తీసుకుంటున్నా. కంభం మండలంలో ర్యాలీలు, ప్రదర్శనలు చేపట్టి శాకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా. ప్రస్తుతం ఉన్న ఉరుకుల పరుగులు, ఒత్తిడితో కూడిన జీవితంలో శాకాహారం తినడం శ్రేయస్కరం. సులువుగా జీర్ణం అవుతుంది. ప్రతి ఒక్కరూ కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు వంటివి తీసుకుంటే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. జీర్ణ సంబంధ సమస్యలు తగ్గుతాయి. కూరగాయల్లో ఉండే మంచి బ్యాక్టీరియా సానుకూల ప్రభావం చూపుతుంది. – జవ్వాజి పవన్‌కుమార్, కంభం

24 ఏళ్లుగా పాటిస్తున్నాం



2000 మార్చి నెల నుంచి మా కుటుంబ సభ్యులందరూ పూర్తి శాకాహారులుగా మారిపోయాం. పండుగలు, బంధుమిత్రుల వచ్చినా వారికి కూడా పూర్తి శాకాహారమే అందిస్తున్నాం. ఎటువంటి వ్యాధులు దరి చేరలేదు. కరోనా కాలంలో కూడా మేము పూర్తి శాకాహారమే తీసుకున్నాం. శాకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కొమరోలు మండలంలో ప్రచారం చేస్తున్నాం. – యర్రబోయిన శ్రీనివాసులు, కేశమ్మ దంపతులు, కొమరోలు

ర్యాలీలు నిర్వహిస్తున్నాం



2012 వరకు అన్నీ తినేవాడిని. ఆ తరువాత శాకాహారం తీసుకోవడం ప్రారంభించా. కొమరోలులో ప్రతి రెండో శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అందరికి అవగాహన కల్పిస్తున్నా. విజయవాడ, హైదరాబాద్, కత్వాల్, వంటి పట్టణాల్లో జరుగు శాకాహార కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించా. పట్టణవాసుల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నా. పండ్లు, కూరగాయలు తీసుకుంటే బి 12 లోపాన్ని నివారించుకోవచ్చు. మాంసాహారంలో అందని పోషకాలు, ఖనిజాలు, లవణాలు శాకాహారంలో అందుతాయి. – కె.గంగినాయుడు, కొమరోలు

ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వండి

కంభం, న్యూస్‌టుడే: ప్రతి నెల లెప్రసి కేసులను పరిశీలించి సమాచారం తప్పక ఇవ్వాలని ఎఫ్‌డీపీ జిల్లా అధికారి డాక్టర్ బి.మాధవీలత అన్నారు. స్థానిక ఎస్ఎన్ కాలనీలో జరుగుతున్న ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ టీబీ కేసులను పరిశీలిస్తుండాలని చెప్పారు. ఎఫ్‌డీపీ కార్యక్రమాలకు గర్భిణలను క్రమంతప్పకుండా పిలుచుకురావాలని చెప్పారు. వారికి ఆరోగ్య పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌వో వాణిశ్రీ, బేస్తవారపేట వైద్యులు పృథ్వీరాజ్, కావ్య, సీహెచ్‌వో హబీబ్‌ఖాన్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం.. వీడ్కోలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఎం.శ్రీనివాసరావును సోమవారం అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఎంఈవో బి.మస్తాన్‌నాయక్, తదితరులు ఆయనకు శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో తదితరులు

● తర్లుపాడు: మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించి సోమవారంతో పదవీవిరమణ పొందుతున్న నరసింహులకు నాయకులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన ఎంపీడీవో సన్మాన సభకు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కల్తీ దాణాపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

త్రిపురాంతకం గ్రామీణం : మండలంలోని గొల్లపల్లిలో ఇతర ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి పశుపోషకులు విక్రయించిన కల్తీ దాణా తవుడును త్రిపురాంతకం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు శ్రీరాములు, పశువైద్యాధికారి సాంబశివరావు సోమవారం పరిశీలించారు. గ్రామానికి వెళ్లి తవుడు కొనుగోలు చేసిన బాధిత రైతులతో మాట్లాడి నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షకు ప్రయోగశాలకు పంపించారు. అనంతరం రైతులకు నాణ్యమైన దాణా గురించి అవగాహన కల్పించారు.

చెరువు కట్టపై ముళ్ల చెట్ల తొలగింపు

మార్కాపురం కంభం, పుల్లలచెరువు, న్యూస్‌టుడే : మార్కాపురం చెరువు కట్టపై ప్రమాదాలకు నిలయంగా మారిన ముళ్ల చెట్లను తొలగింపు చేయడానికి పోలీసులు చొరవ చూపారు. కట్టపై ఇటీవల ముళ్లచెట్లు రహదారికి ఇరువైపులా పెరిగిపోయాయి. వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై స్పందించిన సీఐ సుబ్బారావు, మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబులు జేసీబీలను తెప్పించి చెరువు కట్టపై పెరిగిపోయిన ముళ్ల చెట్లను తొలగింపునకు సోమవారం చర్యలు తీసుకున్నారు. ● కంభంలోని అనంతపురం- అమరావతి జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో సీఐ మల్లికార్జున ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు. ● పుల్లలచెరువులోని కేజీబీవీ పాఠశాలను సోమవారం యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ పరిశీలించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, ర్యాగింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు.



మార్కాపురం చెరువు కట్టపై ముళ్ల చెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

అన్నీ తానై .. కొడుకులా చేరదీసి

☛ దాతల సాయంతో వృద్ధులను అండగా నిలుస్తూ...

నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

మార్కాపురం, న్యూస్‌టుడే:

ఏ రక్త సంబంధం లేకపోయినా అనాథ వృద్ధులకు ఆపన్న హస్తం అందించి... మేము ఉన్నామని భరోసాను కల్పించి ఆశ్రయం ఇచ్చారు తర్లుపాడు మండలంలోని లింగారెడ్డికాలనీకి చెందిన కొమ్ము డేవిడ్- ఏలీనారాణి దంపతులు. డేవిడ్ కేవీపీఎస్ (కులవివక్ష పోరాట సమితి) సంఘంలో పని చేస్తున్న సమయంలో మార్కాపురం మండలంలో పలువురు వృద్ధుల పడుతున్న ఆవేదనను గమనించారు. తమకు ఇంట్లో పరిస్థితి బాగలేదని, అన్నం కూడా పెట్టడం లేదని రోదించే వారికి ఏదైనా తనవంతుగా చేయాలనే ఉద్దేశంతోనే డేవిడ్ సిరి అనాథ వృద్ధాశ్రమాన్ని 2012 సంవత్సరం మే నెలలో ప్రారంభించారు.. మొదట్లో తన ఇంట్లోనే అయిదు మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించారు. ఆతర్వాత 20 మంది వృద్ధులు వచ్చారు. దీంతో తనకు ఉన్న స్థలంలోనే దాతల సహకారంతో రేకుల షెడ్డును నిర్మించి అందులోకి వీరిని మార్చారు. మూడేళ్ల తరువాత ప్రభుత్వ రాయితీతో ఇంటి నిర్మాణం చేపట్టి వృద్ధులను ఆ ఇంట్లోకి మార్చారు. 13 ఏళ్లుగా వృద్ధులకు మూడు పూటల దాతల సహాయంతో ఆహారం అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో అనాథ వృద్ధులకు అండగా నిలిచారు.



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఏలీనారాణి



అనాథ వృద్ధులతో కొమ్ము డేవిడ్

ఎనిమిది మందికి అంత్యక్రియలు నిర్వహించి

వృద్ధాశ్రమంలో అనారోగ్య కారణాలతో ఎనిమిది మంది మృతి చెందారు. వారికి డేవిడ్ స్వయంగా అంత్యక్రియలు నిర్వహించారు. తానే కొడుకై అన్ని కార్యక్రమాలు చేపట్టారు. స్థానికులు అడ్డుకున్నా వెనక్కి తగ్గకుండా వారిని ఒప్పించి అంత్యక్రియలు నిర్వహించారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం వృద్ధాశ్రమంలో ఆరు మంది ఉన్నారు. వీరికి అన్నీ తానై చూసుకుంటున్నారు. అనాథ వృద్ధులు ఎవరైనా తమ ఆశ్రయం పొందవచ్చని పేర్కొంటున్నారు.

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

కురిచేడు, న్యూస్‌టుడే

సమస్య: మండల కేంద్రం కురిచేడులోని ప్రధాన సెంటర్‌లో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆలయం పక్కనున్న ఖాళీ స్థలంలో స్థానికులు, ఇతర ప్రాంతాల వారు మూత్ర విసర్జన చేస్తున్నారు. దుర్వాసన వస్తున్నందున భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బాలక్రిష్ణ, స్థానికుడు

సమాధానం: ఆ స్థలాన్ని శుభ్రపరిచి, ఇతరులు వెళ్లకుండా చర్యలు చేపడతాం.

- చాంద్‌బీ, ఈవో, కురిచేడు

దర్శి, న్యూస్‌టుడే

సమస్య: దర్శి మండలం బండివెలిగండ్ల ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. రాత్రులు విష పురుగులు, అడవి పందుల భయంతో ఆందోళనగా ఉంది.

– ప్రసాద్, గ్రామస్థుడు

సమాధానం: గ్రామంలో విద్యుత్తు స్తంభాలు మార్పు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.

–రాజా రమేష్, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని గుండ్లసముద్రం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. –వెంకటరావు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. –సాంబశివరావు, ఈవోఆర్డీ

ఉద్యోగ మేళాలో 42 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపల్ తదితరులు

దర్శి: దర్శి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన జాబ్ మేళాకు 116 మంది యువత హాజరుకాగా, 42 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కవిత తెలిపారు. వీరితో పాటు కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు వెంకటగణేష్, ఉజ్వల, పోలయ్య, స్కిల్ హబ్ శిక్షణ కోఆర్డినేటర్లు నగేష్, రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కృషి



దామచర్ల సత్యకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న తెదేపా నాయకులు

టంగుటూరు (తూర్పు నాయుడుపాలెం), జరుగుమల్లి (కామేపల్లి), న్యూస్‌టుడే: ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య కొండపి నియోజకవర్గంలో సోమవారం తొలిసారిగా పర్యటించారు. ముందుగా స్వగ్రామమైన తూర్పు నాయుడుపాలెంలో పెదనాన్న అయిన దామచర్ల కృష్ణారావు ఆశీస్సులు పొందారు. అనంతరం జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు పూలమాలలు వేసి సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన వెంట తెదేపా మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పోటు పెదబాబు, ఏలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

▶ కొండపి గ్రామీణం: మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యకు కొండపి తెదేపా నాయకులు సోమవారం స్థానిక పంచాయతీ రాజ్ శాఖ అతిథి గృహంలో శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న మంగళగిరిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కొండపి నియోజకవర్గ తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని కోరారు. రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్లు, పోర్టుల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసి రవాణా, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేస్తామన్నారు.

ఆపదలో వచ్చి.. ప్రాణాలు నిలిపి

● రక్తదానంతో స్ఫూర్తిగా నిలుస్తున్న కనిగిరి యువత

మనిషి అంటేనే సంఘ జీవి. మనచుట్టూ ఉన్న వారు బాగుంటేనే మనమూ బాగుంటాము. చాలామంది తమకు తెలిసిన వారికి ఏదైనా కష్టమొచ్చిందంటే వెంటనే స్పందిస్తారు. తోచిన మేరకు సాయం చేస్తారు. అలా కాకుండా ఆపదలో ఉన్నవారు ఎవరైనా సరే వారిని ఆదుకునేందుకు మేమున్నామంటూ ముందుకొస్తున్నారు కనిగిరి పట్టణానికి చెందిన పలువురు యువకులు. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇప్పటి వరకు వారు చూపిన చొరవ, ఇతర వివరాలను తెలుసుకుందాం.

- న్యూస్‌టుడే, కనిగిరి



ఫోన్ వస్తే చాలు..



పట్టణానికి చెందిన షేక్ సంధాని మొబైల్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. తనది ఏబీ పాజిటివ్ రక్త గ్రూపు. ఇప్పటికే 15 మందికి రక్తదానం చేశారు. ఎక్కడైనా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే అక్కడకు వెళ్లి రక్తం ఇచ్చి వస్తుంటారు. కనిగిరి-పొదిలి రోడ్డులో జరిగిన ఓ ప్రమాదంలో యువకుడు గాయపడ్డారు. రక్తం అవసరం కావాల్సి రావడంతో క్షతగాత్రుడి బంధువులు ఫోన్ చేయగానే.. వెంటనే బయలుదేరి ఒంగోలు ప్రైవేటు వైద్యశాలలో రక్తదానం చేసి వచ్చారు సంధాని. గత ఏడాది నందనమారెళ్ల వద్ద ట్రాక్టరుపై నుంచి పడిన రైతుకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు.

ఇతర ప్రాంతాలకు సైతం వెళ్లి..



మున్సిపాలిటీలోని కాశీపురానికి చెందిన నారాయణ బేల్దారీమేస్త్రి. ఇతనిది ఓ-పాజిటివ్ గ్రూపు. ఇప్పటికి పదిసార్లు రక్తదానం చేశారు. ఎవరైనా ఆపదలో ఉన్నామని ఫోన్ చేస్తే చాలు నేనున్నానంటూ అడిగిందే తడవుగా రక్త దానం చేసి వారికి ఆపద్బాంధవుడిలా నిలుస్తున్నారు. పలు సందర్భాల్లో పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినపుడు వెళ్లి రక్తం ఇవ్వడం అలవాటుగా చేసుకున్నారు. కరోనా సమయంలోనూ గుంటూరు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి అందరి మన్ననలు అందుకున్నారు.

ఇప్పటికి 13 సార్లు ఇచ్చి..



పట్టణానికి చెందిన యువ రైతు భాస్కర్. నిమ్మ సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి వరకు 13 సార్లు తన ఏ-పాజిటివ్ రక్తం దానం చేసి పలువురి ప్రాణాలు కాపాడారు. స్నేహ హస్తం స్వచ్ఛంద సంస్థ ద్వారా పలుమార్లు రక్తదానం చేశారు. తొలుత ఆరోగ్యపరమైన ఇబ్బందులు వస్తాయోమోనని భయపడ్డారు. అనంతరం దీనిపై అవగాహన పెంచుకొని తనతోపాటు మరో పది మందితోనూ రక్తదానం చేయిస్తున్నారు. మరొకరి ప్రాణాలు నిలుపుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందంటున్నారు.

గ్రామీణులకు తోడుగా..



ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న రాజు ఇప్పటి వరకు ఎనిమిది సార్లు రక్తదానం చేశారు. చాలా మంది గ్రామీణ ప్రాంతంలో ఉండే వారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, శస్త్రచికిత్సలు అవసరమైనప్పుడు రక్తం అందక ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారికి నేనున్నానంటూ ముందుకొచ్చి రక్తదానం చేస్తుంటారు. తనతోపాటు స్నేహితుల ద్వారా కూడా రక్తదానం చేయిస్తున్నానని, దీనివల్ల ఎంతో సంతృప్తిగా ఉందంటున్నారు రాజు.

నిలిచి.. పోటీల్లో గెలిచి

● రాష్ట్ర, జిల్లా జట్లకు పలువురు క్రీడాకారుల ఎంపిక



బ్రెటిలీ



దయాసాగర్

దర్శి, న్యూస్‌టుడే: మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బ్రెటిలీ, దయాసాగర్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గత ఆదివారం సింగరాయకొండలో జరిగిన జిల్లా స్థాయి పాఠశాల ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపారని హెచ్ఎం గురుప్రసాద్ తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అంజిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

▶ టంగుటూరు(మర్లపాడు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఒంగోలులోని ఏబీఎం డిగ్రీ కళాశాలలో సెప్టెంబరు 28న జరిగిన అండర్-19 పోటీల్లో బాలుర విభాగంలో అక్షయ్‌కుమార్, లక్ష్మీనరసింహ, ప్రణయ్, విక్రాంత్‌లు.. బాలికల విభాగంలో సాధియా ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 2 నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడి కౌసల్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

▶ సింగరాయకొండ గ్రామీణం: సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో సోమరాజుపల్లి సీఎస్‌సీఏ జూనియర్ కళాశాల విద్యార్థులు నలుగురు సత్తా చాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. వి.రామ్‌చరణ్, సందీప్, నితిన్, వంశీ అనే విద్యార్థులు ఎంపికయ్యారని, త్రైక్వాండో పోటీల్లో లీలా మైత్రి ఎంపికైనట్లు పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ శ్రీనివాసరావు, కరెస్పాండెంట్ గీతారాణి అభినందించారు. ▶ హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో జూనియర్ బాలబాలికల విభాగంలో ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జిలానీబాషా సోమవారం తెలిపారు. సింగరాయకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్- 14, 17 విభాగాల్లో జరిగిన పోటీల్లో జి.నరేంద్ర, ఎ.అను ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం పద్మావతి, ఎంఈవో పెద్దిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వక్తృత్వంలో విద్యార్థినుల సత్తా..

మర్రిపూడి, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మండలం నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో రంగయ్య సోమవారం తెలిపారు. మర్రిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వై.లక్ష్మీఅనన్య, కూచిపూడి ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని భవ్యశ్రీలక్ష్మిలు ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వారిని ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం సూపర్‌వైజర్ విక్టోరియారాణి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహసీల్దారు మురళి, సీడీపీవో మాధవీలత, ఎంఈవో సురేఖలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతాయన్నారు. ▶ వెలిగండ్ల: వెలిగండ్ల కస్తూర్బా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సరోజని చిరుధాన్యాలు, పౌష్టికాహారం గురించి వివరించారు. డాక్టర్ మౌనిక, ఎంఈవో డి.రామిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగుల చెరువు ఆధునికీకరణ



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: భూగర్భ జలాలు పెంచేందుకు పట్టణంలోని నాగులచెరువును ఆధునికీకరణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆక్రమణకు గురై, పిచ్చి మొక్కలతో నిండిన ఈ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార్లు పట్టించుకోకపోవడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్నారు. ఎవరి ఇష్ట ప్రకారం వాళ్లు మట్టి, ఇసుక అక్రమంగా తరలించుకుపోయారని, దీంతో పాటు కొంత ఆక్రమించారన్నారు. 74 ఎకరాల్లో ఉన్న చెరువు ఎంత వరకు ఆక్రమణలు జరిగాయో సర్వే చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి, జలవనరుల శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన



పీసీపల్లిలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమణారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: సమాచారహక్కు చట్టం ద్వారా ప్రతి పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారాన్ని తెలుసుకోవచ్చని కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఇ.వి.రమణ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులు, సిబ్బందికి దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, ఏవో జ్యోత్స్నదేవి తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ప్రభుత్వ కార్యాలయంలో పౌరులు అడిగిన సమాచారాన్ని స.హ చట్టం ద్వారా 30 రోజుల్లో అందించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో డి.వి. రమణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వ్యవసాయశాఖ అధికారులతో స.హ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారుల వివరాలను ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థులకు చేయూత



విద్యార్థిని కిట్టు అందజేస్తున్న మహీధర్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు కనిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అలగిరి మహీధర్ నాయుడు సోమవారం రూ.30 వేల విలువ చేసే ప్యాడ్స్, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం దాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన సైనికుల ప్రాయశ్చిత్త పూజలు



దర్శి వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న వీర మహిళలు, జనసేన నాయకులు

దర్శి, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఆలయాల్లో పూజలు చేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనోభావాలను గత వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. ఆ సంఘటనకు ఆవేదన వ్యక్తం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారన్నారు.

▶ తాళ్లూరు: మండలంలోని గుంటిగంగ గంగాభవాని అమ్మ వారి ఆలయంలో జన సైనికులు, వీర మహిళలు ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. యర్రంశెట్టి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దర్శి: మండలంలోని గణేషునిపురానికి చెందిన పాలెపోగు మసలయ్య ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక తెదేపా నాయకుడు పి.నాగేశ్వరరావు రూ.9,500ల నగదును సోమవారం అతని ఇంటికెళ్లి అందజేశారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

పామూరు: పొదుపు సంఘాల సభ్యులు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఏపీఎం జి.విద్యాసాగర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది.

భూ సమస్యలపై వినతులు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరానికి చెందిన ఇద్దరు, సోమవరప్పాడుకు చెందిన మరొక రైతు మ్యుటేషన్ చేయాలని సోమవారం తహసీల్దారు కె.నాగలక్ష్మికి వినతిపత్రాలు అందజేశారు. మీకోసం లో వారితోపాటు తాళ్లూరుకు చెందిన మరో రైతు సర్వే నంబరు పోర్టబిలిటీపై విన్నవించారు.

బాధ్యతగా పనిచేస్తేనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తాళ్లూరు, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ టి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. గత వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే అభివృద్ధి పనులు ముమ్మరం చేయించి సత్తా చాటిందని వివరించారు. అధికారులు తమ శాఖల్లోని పురోగతి గురించి వివరించారు. విఠలాపురం పంచాయతీ రమణాలవారిపాలెంలో మంచినీటి సమస్య గురించి మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో తెలియజేసినా.. అధికారులు ఎందుకు సక్రమంగా వివరాలు వెల్లడి చేయడం లేదని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈ వాలీపై ఆ గ్రామ సర్పంచి మారం ఇంద్రసేనారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, ఈవోఆర్డీ కేజీఎస్.రాజు, ఎంఈవో ఎల్.సుధాకరరావు, ఏవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలి



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు: పోలీసు స్టేషన్‌కు సంబంధించిన అన్ని రకాల దస్త్రాలను సక్రమంగా నిర్వహించాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సూచించారు. తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఆవరణలో ఉన్న ద్విచక్ర, ఇతర వాహనాల వివరాలను కాగితాలపై నమోదు చేసి అతికించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

▶ దర్శి: దర్శిలో సోమవారం ఎంవీఐ రవికుమార్, పొదిలి ఆర్టీసీ డీఎం సుందరరావు వాహన తనిఖీలు చేశారు. అధిక లోడుతో వెళుతున్న, సరైన ధ్రువపత్రాలు లేని వాటిని గుర్తించి రూ.30 వేల జరిమానా విధించారు.

▶ పీసీపల్లి: తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.కోటయ్య హెచ్చరించారు. సోమవారం పెదఅలవలపాడు వద్ద వాహన చోదకులను బ్రీత్‌ఎనలైజర్ ద్వారా పరీక్షించారు.

సెలవుల్లో అప్రమత్తత అవసరం

వెలిగండ్ల, న్యూస్‌టుడే: సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మధుసూదన్‌రావు సూచించారు. సోమవారం వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దసరా సెలవుల్లో ఆడుకునేందుకు బయటకు వెళ్తున్న పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలన్నారు. చెరువులు, కుంటలు, వాగులు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంఈవో రామిరెడ్డి, హెచ్ఎం రాఘవాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి ఆర్డీవోగా జి.కేశవర్ధన్‌రెడ్డి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం ఆర్డీవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుత ఆర్డీవో పి.జాన్ ఇర్విన్ కడపకు బదిలీ అయ్యారు. నూతన ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, రాయితీలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి రెవెన్యూ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తామన్నారు.

అటవీశాఖ అధికారి ఉమామహేశ్వరరెడ్డి..



కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి అటవీశాఖ అధికారిగా తుమ్మా ఉమామహేశ్వరరెడ్డి సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రామిరెడ్డి కావలికి బదిలీపై వెళ్లారు. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పనిచేస్తూ ఉమామహేశ్వరరెడ్డి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

జరుగుమల్లి ఎంపీడీవో రమణమూర్తి..

జరుగుమల్లి, న్యూస్‌టుడే: జరుగుమల్లి ఎంపీడీవోగా ఎం.వి.రమణమూర్తి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన కొండపిలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన జలజాక్షి నెల్లూరు జిల్లాకు వెళ్లారు. ఈ సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు..

దర్శి: దర్శి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా దర్శికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సుందరరామయ్య డిస్టిలరీకి బదిలీపై వెళ్లారు. శ్రీనివాసరావుకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

తెదేపా నాయకుడి కుటుంబానికి పరామర్శ

కొండపి గ్రామీణం: కొండపి గ్రామ తెదేపా నాయకుడు నన్నూరి సుబ్బరామయ్య తల్లి ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మంత్రి బాల వీరాంజేయస్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పరామర్శించారు. వారి వెంట నాయకులు రామయ్య చౌదరి, క్రిష్టారెడ్డి, నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు
•ఒంగోలు • సంతనూతలపాడు

రెండో రోజూ పైపులైను పనుల అడ్డగింత

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: రైతులకు పరిహారం చెల్లించిన తరువాతే బీపీసీఎల్ పైపులైను పనులు చేపట్టాలని రైతు సంఘం నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. మైనంపాడులో చేపడుతున్న పనులను రెండో రోజైన సోమవారం కూడా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీపీసీఎల్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లుతో రైతు ప్రతినిధులతో మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి విలువకు రెండున్నర రెట్లు అదనంగా చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలువురు రైతులకు పరిహారం చెల్లించామని... మిగిలిన వారికీ త్వరలోనే అందజేస్తామని వివరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.ఆంజనేయులు, పమిడి వెంకట్రావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మాబు, వి.బాలకోటయ్య, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, పెద్దబ్బాయి, బంకా సుబ్బారావు, రైతులు గుండవరపు సుబ్బారావు, హనుమంతరావు, బత్తుల సుబ్బారావు, అంజయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల కారణంగా నిలకపాడు విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని ప్రాంతాలకు మంగళవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టి.సంతోష్ తెలిపారు. మద్దులూరు, చిలకపాడు, పి.తక్కెళ్లపాడు, గంగవరం, ఎం.వేములపాడు, బొద్దువానిపాలెం, గుమ్మళంపాడు, ఎనికపాడు, బి.మాచవరం గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

పాఠశాలలో శుభ్రత పనులు

చీమకుర్తి: పరిశుభ్రతా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నెహ్రూ యువకేంద్ర వాలంటీర్లు రాజేష్, ఆనంద్ పేర్కొన్నారు. చీమకుర్తి లోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా... విద్యార్థినులు బడి పరిసరాలను శుభ్రం చేశారు. అందరూ మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు... ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు.

అల్లుకున్న తీగలతో అంతరాయం




సంతనూతలపాడు-చండ్రపాలెం మధ్యలో ఓ స్తంభం పరిస్థితి ఇది

మంగమ్మ కళాశాల ఎదురు కాలనీలో ఇలా...

స్తంభాల నిర్వహణ సరిగా లేకపోవడంతో తరచూ విద్యుత్తు అంతరాయాలు తలెత్తుతున్నాయి. పలు చోట్ల పిచ్చితీగలు పరివర్తకాలు, తీగలను పూర్తిగా అల్లుకోవడంతో సమస్య నెలకొంటోంది. గాలులు, వర్షాల సమయంలో సరఫరా నిలిచిపోతోందని ఆ పరిసర నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు వైర్లలో ఏదైనా సమస్య తలెత్తినా సరిచేయడం కష్టమవుతోందని వాపోతున్నారు.

వెలుగుల్లేని ఒంగోలు



పాత జాతీయ రహదారిలో ఆస్టర్ రమేష్ కూడలిలో కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు వద్ద... 'ఐ లవ్ ఒంగోలు' అన్న ఆంగ్ల అక్షరాలు గతంలో అమర్చారు. సాయంత్రం వేళ ఇవి వెలుగులు పంచుతూ... నగరానికే వన్నె వారికి కనువిందు చేసేవి. చాలామంది ఇక్కడ సెల్ఫీలు సైతం దిగేవారు. గత కొన్నాళ్లుగా వీటిలోని దీపాలు వెలగక కళ కోల్పోయి ఇలా కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు వీటిని బాగుచేయించాలని నగర వాసులు కోరుతున్నారు.

- ఈనాడు, ఒంగోలు

పనులు చేశారు... గుంత వదిలేశారు!



మద్దిపాడు పడమరపాలెం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద పరిస్థితి ఇది. ఇక్కడ భూగర్భంలోని తాగునీటి పైపులైను దెబ్బతినడంతో... ఆ ప్రాంతంలో తవ్వి మరమ్మతులు చేపట్టారు. తరువాత గుంతను పూడ్చకపోవడంతో అందులో నీరు చేరి ప్రమాదకరంగా మారింది. అక్కడే చిన్నారులు ఆడుతుండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. - న్యూస్‌టుడే, మద్దిపాడు

పనికి తగ్గ వేతనం ఇవ్వాలని నిరసన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మిక ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. నూతన ఆర్థిక విధానాల అమలుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సీపీఎం నాయకుడు జీవీ.కొండారెడ్డి పేర్కొన్నారు. ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, నాయకులు టి.మహేష్, పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు.

సచివాలయ ఏఎన్ఎంల ఆందోళన: ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సచివాలయ ఏఎన్ఎంలు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ... వైద్యేతర పనులు అప్పగిస్తుండడంతో వ్యాక్సినేషన్ వంటి కార్యక్రమాలపై ప్రభావం పడుతోందన్నారు. ఇతర బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించారు.

రామతీర్థం నుంచి నీటి విడుదల నిలిపివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: రామతీర్థం జలాశయం నుంచి దిగువకు నీటి విడుదలను నిలిపివేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో దిగువ ప్రాంతాల్లో నీటి వినియోగం తగ్గింది. మరోవైపు కాలువకు మేజర్ హెడ్ వద్ద తలుపు ఏర్పాటుకు కొలతలు తీసుకోనేందుకు వీలుగా నీటి విడుదల ఆపేసినట్లు తెలిసింది. ప్రస్తుతం జలాశయంలో నీటి మట్టం 81.26 మీటర్లుగా ఉంది. రిజర్వాయర్‌లోకి 391 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ఓటు హక్కు సద్వినియోగంతో ప్రయోజనం

సంతనూతలపాడు: పర్యనిదిపాడు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని ఎంఈఓ వెంకరెడ్డి తెలిపారు. పేర్నమిట్టలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మన ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందన్న విషయం గుర్తించి... ప్రతి ఎన్నికల్లో ఆ హక్కును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటు ప్రాధాన్యం, నమోదు, వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల సమస్యపై నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న తెదేపా కౌన్సిలర్లు రమాదేవి, అంజలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాటు శివారు కాలనీల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెదేపా కౌన్సిలర్లు సోమవారం నాటి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. ఛైర్మన్ గోపవరపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ వై.రామకృష్ణయ్య, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. వీధి దీపాల సమస్యను తెదేపా కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి ప్రస్తావించారు. కమిషనర్ స్పందిస్తూ... దీపాల మరమ్మతులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు టెండర్లు పిలుస్తున్నామని త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. పట్టణ పరిధిలోని కొన్ని సచివాలయాల్లో అదనపు సిబ్బంది ఉన్నారని... వారికి మున్సిపల్ కార్యాలయంలో విధులు అప్పగించాలని పలువురు కౌన్సిలర్లు సూచించారు. మూడు నెలల వ్యవధిలో ఛైర్పర్సన్ తెలియకుండా సుమారు రూ.20 లక్షల బిల్లులు ఎలా చెల్లించారని తెదేపా కౌన్సిలర్లు ప్రశ్నించారు. ... అధికారులను ప్రశ్నించారు. పాలకవర్గానికి తెలియకుండా ఎలాంటి బిల్లులు చెల్లించొద్దని కోరారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన పది అంశాలను ఆమోదించారు. మేనేజర్ పోతురాజు, వైస్ ఛైర్మన్ ఎస్.మాణిక్యం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖ ఎస్ఈగా వరలక్ష్మి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇరిగేషన్ శాఖ ఒంగోలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్‌గా డి.వరలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్జీవోల సంఘం బాధ్యులు జి.కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసరావు, వేములు సునీల్‌కుమార్, షరీఫ్, కృష్ణకిషోర్, వీరయ్య తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

• **విద్యుత్తు ఎస్ఈగా వెంకటేశ్వర్లు:** ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్ఈ కేవీజీ సత్యనారాయణను ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. నూతన ఎస్ఈని విద్యుత్తు అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

• **చెన్నకేశవ స్వామి ఆలయ ఈవోగా శివకుమార్:** ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: శ్రీప్రసన్న చెన్నకేశవ, శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా ఆర్.శివశంకర్... సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందజేశారు. కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయం ఈవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

• **ఆర్ఐ బాధ్యతల స్వీకరణ: మద్దిపాడు:** మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పి.వి.రమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టంగుటూరులో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

?: త్రోవగుంట అంబేడ్కర్ సామాజిక భవనం వీధిలో రెండు నెలలుగా దీపం వెలగక రాత్రి వేళ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – దేవదానం, స్థానికుడు

✓: కొత్త దీపం వేయించి సమస్య లేకుండా చూస్తాం. – బాలాజీ, వీధి దీపాల పర్యవేక్షకుడు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే:

?: నాగులుప్పలపాడులోని రచ్చబండ, బ్రహ్మంగారి దేవస్థానం పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో జ్వరం కేసులూ ఎక్కువగానే ఉన్నాయి. – చుండూరి పద్మావతి, గ్రామస్థురాలు

✓: పరిశీలించి... వెంటనే పారిశుద్ధ్య పనులు చేపడతాం. – రవికుమార్, పంచాయతీ కార్యదర్శి

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం తయారీ



వంటకాలను పరిశీలిస్తున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి మాధురి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి మాధురి పేర్కొన్నారు. ఒంగోలు కబాడీపాలెంలో సోమవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సదస్సులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న బాలామృతం, పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే రాగులు, సజ్జలతో తయారుచేసుకునే వంటకాలపై అవగాహన కల్పించారు. ముందుగా వివిధ రకాల వంటకాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో ఫణిరాజకుమారి, పర్యవేక్షకురాలు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ కాలనీలోని షాదీఖానాలో సోమవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల ముగింపు వేడుకల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఇవాంజిలిన్ పాల్గొన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలియజేశారు. పర్యవేక్షకులు కె.దేవసేన, ఆర్.పిచ్చమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏఎంవో రమేష్

నవ్యాంధ్ర సాధనలో విద్యార్థులే కీలకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 అంశంపై విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉత్సాహంగా సాగాయి. డీఆర్ఆర్ మున్సిపల్ పాఠశాలలో ఆరు నుంచి పది తరగతుల వారికి సోమవారం వీటిని నిర్వహించారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచినవారు పాల్గొన్నారు. సమగ్రశిక్ష ఏఎంవో ఒ.రమేష్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నవ్యాంధ్ర సాధనలో విద్యార్థులూ కీలకభూమిక పోషించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాము, రమణయ్య, నాగేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రతిభ చాటినవారికి బహుమతులు అందజేశారు.

గాంధీ జయంతి రోజున మాంసాహారం నిషేధం

చీమకుర్తి, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న చీమకుర్తి పట్టణ పరిధిలో మాంసాహార విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. ఆ రోజున మాంసం, చేపల అమ్మకాలు చేపట్టే దుకాణాలు మూసివేయాలని, హోటళ్లలో మాంసాహార విక్రయాలూ చేపట్టరాదని పేర్కొన్నారు.

బీసీ చైతన్య సమితిలో చోటు

చీమకుర్తి: జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా చీమకుర్తికి చెందిన ఇజ్జగిరి రమేష్ నియమితులయ్యారు. సమితి అధ్యక్షుడు బి.సి.రమణ నుంచి సోమవారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

30 వరకు నిషేధాజ్ఞలు అమలు

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అక్టోబరు ఒకటో తేదీ నుంచి 30 వరకు... 30 పోలీసు యాక్టును అనుసరించి నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలంటే పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. మైకుల వినియోగం, బాణసంచా కాల్పులకూ అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విశేష వైద్య సేవలకు సత్కారం



డాక్టర్ శేషాద్రి శేఖర్‌ను సత్కరిస్తున్న జీజీహెచ్ అధికారులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: న్యూరోసర్జరీలో తనదైన ముద్ర వేసి వేలాది మంది ప్రాణాలు నిలిపిన ఘనత డాక్టర్ శేషాద్రిశేఖర్‌కు దక్కుతుందని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలరావు కొనియాడారు. శేషాద్రిశేఖర్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఒంగోలులోనే విద్యనభ్యసించి ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. ఆయన నిబద్ధత నేటి వైద్యులకు ఆదర్శమని డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్ పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, న్యూరో విభాగం వైద్యుడు గోపీకృష్ణ, సమన్వయకర్త తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానంతో విద్యారంగం బలోపేతం



సదస్సులో మాట్లాడుతున్న ఏకేయూ ఉపకులపతి మూర్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించినప్పుడే ఎవరికి వారు వ్యక్తిగతంగా సంతృప్తి పొందుతారని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి డీవీఆర్ మూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో 'ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం' ఆధ్వర్యంలో 'ఎన్ఈపీ 2020 దేశీయ విజ్ఞానం' అనే అంశంపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యాసంస్థల బలోపేతానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయన్నారు. ఈ మేరకు నాణ్యమైన విద్య అందరికీ చేరువవుతుందన్నారు. ట్రిపుల్ ఐటీ సహాయ ఆచార్యులు కేవీ కృష్ణారావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమలులో దేశీయ విజ్ఞానం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. లా కళాశాల ప్రిన్సిపల్ నటరాజకుమార్ తదితరులు మాట్లాడారు.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎంపికైన జిల్లా బాలికల జట్టు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేర్నమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అండర్-14 విభాగంలో బాలబాలికల జట్లు ఉత్సాహంగా తలపడ్డాయి. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి బాబు, పీఎంసీ ఛైర్మన్ శ్రీలత, సరస్వతి విద్యాసంస్థల ఛైర్మన్ రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయిని పార్వతిశాంతి, పీడీలు పాల్గొన్నారు.

కోరం లేకుండానే పొగాకు సమాఖ్య మహాజన సభ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పొగాకు సమాఖ్య (శరభయ్య సొసైటీ) మహాజన సభ కోరం కాకుండానే నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. సమాఖ్య అధ్యక్షుడు బసివిరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సభలో కొన్ని తీర్మానాలు చేశారు. బోర్డు ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేయాలని, నాగులుప్పలపాడులో సమాఖ్య నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ నిర్వహణ బాధ్యతను స్థానికులకు అప్పగించాలన్న ప్రతిపాదనలను అజెండాలో చర్చకు పెట్టారు. 1680 మంది సభ్యులున్న సమాఖ్యలో కనీసం పదిశాతం మంది హాజరైతేనే కోరం అయినట్లు గుర్తిస్తారు. ఆరు నెలలకోసారి సభ నిర్వహిస్తారు. అలాంటిది కోరం లేకుండానే సభ జరపడంపై సభ్యుల నుంచే విమర్శలు వ్యక్తమయ్యాయి.



సమావేశంలో పాల్గొన్న హిజ్రాలతో ఎస్పీ దామోదర్

హిజ్రాలు ఆత్మగౌరవంతో బతకాలి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధిలో హిజ్రాలు కూడా భాగస్వాములు కావాలని... ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతకాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆకాంక్షించారు. ఒంగోలులోని పోలీసు కల్యాణ మండపంలో హిజ్రాలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గౌరవంగా జీవించేవాళ్లని గౌరవిస్తామని... బలవంతపు వసూళ్లు, దౌర్జన్యాలకు పాల్పడేవారిని ఉపేక్షించమని స్పష్టం చేశారు. తాము గౌరవప్రదమైన జీవితం గడపాలని భావిస్తున్నట్లు పలువురు హిజ్రాలు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ చంద్రశేఖర్, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సీఐ అజయ్ కుమార్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పుడమికి చీరలే సారెలా.. బిందువులే ఇంధనంలా..





నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన కావూరి లాజర్ పొగాకు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఎకరా పొలంలో వేసిన పొగ నారుకు నిత్యం తడి అందించేందుకు ఎండు గడ్డి పరచాలి. అయితే ట్రక్కు గడ్డి రూ.20 వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఒంగోలులో పాత చీర ఒక్కోటి రూ.30కు కొనుగోలు చేసి ఇలా పరచడంతో ఖర్చు తగ్గిందన్నారు. నారుకు బిందు సేద్యం ద్వారా నీరందిస్తూ కాపాడుకుంటున్నారు.

–ఫొటోలు: ఈనాడు, ఒంగోలు



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది, వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, సిబ్బంది వాటి పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా 227 వినతులొచ్చాయి. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఎస్‌డీసీలు వరకుమార్, లోకేశ్వరరావు, కుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార చిట్టీలపై కఠిన చర్యలు

◗ జిల్లా ఎస్పీ దామోదర్

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో అనధికార చిట్టీల నిర్వహణ, ప్రైవేటు ఫైనాన్స్ కార్యకలాపాలను సహించేది లేదని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్)లో ఆయన వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరించారు. దీనికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 97మంది తమ వినతులు అందజేశారు. వీటిలో ఆర్థిక వివాదాలే ఎక్కువగా ఉన్నాయి. వీటిపై ఎస్పీ స్పందిస్తూ చిట్టీలు, ఫైనాన్స్ నిర్వహించే వారు ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆర్థిక లావాదేవీలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైమ్స్) శ్రీధర్‌రావు, అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ దామోదర్

తీర ప్రాంత అభివృద్ధికి కృషి

ఒంగోలు నగరం, టంగుటూరు, న్యూస్‌టుడే: మారిటైం బోర్డుకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తానని తెదేపా నేత, దామచర్ల సత్య అన్నారు. మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం దిల్లీ హైవే సమావేశ మందిరంలో ఆయన్ని యోగా మిత్రమండలి, చేయూత సేవా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యోగా మిత్రమండలి ప్రతినిధి తాతా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్య మాట్లాడుతూ నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు అందించే చేయూత సంస్థలో తాను భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉందన్నారు. మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా ఈ నెల 5న బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. రాష్ట్రంలో 980 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండటం వల్ల భవిష్యత్తులో ఎంతో అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. కొత్తగా అయిదు పోర్టులు, 14 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. యోగా మిత్రమండలి అధ్యక్షులు శిద్దా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చేయూత సేవాసంస్థకు సత్య రూ.లక్ష సాయం అందించి వృద్ధుల సంక్షేమానికి దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో శ్రీహర్షిణి కళాశాల అధినేత గోరంట్ల రవికుమార్, ఢాకా అంజిరెడ్డి, యోగా గురువు ఆంజనేయులు, శేషాచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మారిటైం బోర్డు ఛైర్మన్ సత్యను సత్కరిస్తున్న యోగా మిత్రమండలి ప్రతినిధులు

వట్టివేర్ల సాగు... లాభాలు బాగు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే:



ఇసుక నేలల్లో సిరులు పండిస్తున్నారు కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రైతు **పూరిణి బాలకృష్ణ**. వినూత్న రీతిలో వట్టివేర్లను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ పంటకు డిమాండ్ పెరగడం, కొన్ని పరిశ్రమలు కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో మరికొందరు రైతులు పంట సాగుకు సిద్ధమవుతున్నారని ఆయన చెబుతున్నారు.

◗ **10 ఎకరాల్లో ప్రారంభించి.. :** రైతు బాలకృష్ణ మొదట్లో ఇసుక నేలల్లో సీమ, కంద వంటి పంటలు సాగు చేశారు. వాటికి స్థిరమైన ధరల్లేక నష్టపోయారు. ఏడాదిన్నర కిందట పంట మార్పిడిలో భాగంగా ప్రయోగాత్మకంగా వట్టివేర్ల సాగుకు శ్రీకారం చుట్టారు. తొలి ప్రయత్నంలో 10 ఎకరాల్లో పంట వేశారు. ముందుగా ఎరువుల కంపెనీలు విత్తనాలు అందించారు. విత్తిన ఏడు నెలలకు పంట చేతికొచ్చింది. మొక్క పెరిగిన తరువాత ప్రతి రెండు నెలలకోసారి వేర్లను పరిశీలించారు. పొలంలో పైపులు వేసి తుంపర సేద్యం ద్వారా నీరు అందించారు. వ్యవసాధికారుల సలహాలు, సూచనలు మేరకు పది రోజులకోసారి పురుగు మందులు పిచికారీ చేశారు. పంట కోత సమయంలో మాత్రం జేసీబీతో మొక్కలను తీశారు. పరిమిత సంఖ్యలోనే ఎరువులను వినియోగించారు. ఎకరానికి రెండు టన్నుల పైగా దిగుబడి వస్తుందని, ఖర్చులన్నీ పోను రూ.60 వేల నుంచి రూ. 70 వేల వరకు లాభాలు పొందవచ్చని రైతు చెబుతున్నారు. మంచి ఆదాయం లభించడంతో ప్రస్తుతం 23 ఎకరాల్లో పంట సాగును చేస్తున్నానని తెలిపారు. మొత్తం పంటను రెండు ఎకరాల విస్తీర్ణంలో బిట్లు, బిట్లుగా వేస్తే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని బాలకృష్ణ వివరిస్తున్నారు.

◗ **విరివిరిగా వినియోగం..:** ప్రస్తుతం సుగంధ ద్రవ్యాల్లో వినియోగించే వట్టివేరు తైలానికి మంచి డిమాండ్ ఉంది. ఈ తైలం మంచి ఔషధ గుణాలు కలిగి ఉండటంతో పాటు, సువాసనలు వెదజల్లుతుంది. వట్టివేరును సాధారణంగా కూలర్లు, చల్లదనాన్ని ఇచ్చేందుకు ఇంటి కిటికీలు, తలుపుల వద్ద వినియోగించే చాపలు, దేవుడికి వేసే మాలల్లో వీటిని ఉపయోగిస్తుంటారు. ఈ పంట ఎవరైనా సాగు చేయాలని భావిస్తే రెండు, మూడు ఎకరాల్లో కాకుండా పది ఎకరాల్లో పంట వేయాలని.. అప్పుడు లాభాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని ఆ రైతు చెబుతున్నారు.

సమస్య ● పరిష్కారం

◗ **సమస్య:** మా గొర్రె పిల్లలు మట్టి నాకుతూ తరచూ పారుచున్నాయి. ఏమి చేయాలి?

–ఎం.నారాయణ, కొండబోయినపల్లి

సమాధానం: గొర్రె పిల్లలు మట్టి నాకకుండా ఉండేందుకు కొట్టంలో ఖనిజలవణ మిశ్రమ రాళ్లను వేలాడదీయాలి. పారుతున్న గొర్రెపిల్లలను వేరుచేసి పశువైద్యాధికారి సలహాతో యాంటీ బయాటిక్ పొడి మందు వాడాలి.



షేక్ మునీర్, పశువైద్యాధికారి డీజీపేట

◗ **సమస్య:** గేదె నుంచి ఏడాదికి ఒక దూడను పొందాలంటే ఏం చేయాలి. – సీహెచ్.ప్రసాద్, చెన్నపునాయునిపల్లి.

సమాధానం: ఏడాదికి ఓ దూడను పొందాలంటే గేదె ఈదిన 60 రోజుల తరువాత 90 రోజుల లోపు చూలు కట్టించాలి. అప్పుడు ఏడాదికి ఒక దూడను పొందవచ్చు.

– న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

రైతేరాజు

జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు పడటంతో పాటు ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఆయా రకాల పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి దర్శి కేవీకే సమన్వయకర్త డా.రమేష్ వివరిస్తున్నారు ఇలా...



వాతావరణ మార్పులు.. కావాలి జాగ్రత్తలు

◗ ఇటీవల కురిసిన వర్షాలకు కంది పంటలో ఆకుమ్డ వైరస్ వల్ల వ్యాపించే వెర్రి తెగులు కనిపిస్తుంది. నివారణకు తెగులు సోకిన మొక్కలను వెంటనే తొలగించాలి. గంధకం మందును ఎకరాకు 600 గ్రాముల చొప్పున నీటితో కలిపి పిచికారీ చేయాలి.

◗ అల్పంగా వరి నాట్లు వేయటం వల్ల ఉల్లి కోడు తెగులు ఎక్కువగా ఆశించింది. దీన్ని సరైన సమయంలో నివారించకపోతే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నివారణకు నాట్లు వేసిన వెంటనే కార్బోఫ్యూరాన్ గుళికలను ఎకరానికి 10కిలోల చొప్పున చల్లించాలి.

◗ ముఖ్యంగా మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఎక్కువగా ఆశించింది. నివారణకు ప్రైమ్ పురుగు మందును ఎకరానికి 10 గ్రాముల చొప్పున నీటితో ఆకుల సందుల్లో పడేలా పిచికారీ చేయాలి.

◗ ఇటీవల కురిసిన వర్షాలకు పలువురు రైతులు మిరప నాట్లు వేస్తున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా మిరపలో వచ్చే వేరు, రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చు. నాట్లు వేసే సమయంలో 10 లీటర్ల నీటిలో 5-10 మి.లీ. కాన్ఫిడార్, 20 గ్రాములు బావిస్టిన్ కలిపి మిరప నారు వేళ్లను ముంచి నాటుకోవాలి. – న్యూస్‌టుడే, దర్శి

మీ కోసం

పసుపు.. సస్యరక్షణతో మేలు

పసుపు దీర్ఘకాలిక పంట. గతేడాది దీనికి మంచి ధరలు రావడంతో ఈ ఏడాది పశ్చిమ ప్రకాశంలో రైతులు విస్తారంగా సాగు చేశారు. ఈ పంటలో తగిన చర్యలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ వివరిస్తున్నారు ఇలా.. –న్యూస్‌టుడే, కంభం



◗ **పోషక లోపాలు:** పసుపు ఆకుల అంచులు ఎండి పోవడాన్ని పొటాష్ లోపంగా గుర్తించవచ్చు. నివారణకు లీటర్ నీటికి 10 గ్రాముల మల్టీకే గానీ, పల్స్ లాండ్ పోషకాలు 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఇనుపధాతు లోపం వల్ల ఆకు మధ్యభాగం తెల్లగా మారుతుంది. లీటర్ నీటికి 5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్‌ను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. జింకు ధాతు లోపం ఉంటే ఆకు మధ్య భాగం లేత ఆకుపచ్చ రంగుకు మారుతుంది. నివారణకు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చల్లుకోవాలి.

◗ **దుంప ఈగ:** ఇది కాండం లోపలి అంతర్గతాన్ని తింటూ.. మలినాలను బయటకు పంపిస్తుంది. దీనివల్ల ఆకులపై వరుస రంధ్రాలు ఏర్పడతాయి. నివారణకు 10 కిలోల 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి. లీటర్ నీటికి 1 మి.లీ. డైమిథోయేట్ కానీ, 1 మి.లీ. ప్రొఫెనోఫాస్ కానీ పిచికారీ చేసుకోవాలి.

◗ **అధిక రెక్కపుర్:** ఈ కీటకాలు ఆకుల అడుగు భాగంలో చేరి, పిల్ల పురుగులుగా ఉండి రసం పీల్చడం వల్ల ఆకు పైభాగాన తెల్లని మచ్చలు ఏర్పడతాయి. నివారణకు లీటర్ నీటికి రెండు మి.లీ. డైమిథోయేట్ గానీ, 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ కానీ పిచికారీ చేసుకోవాలి.

◗ **తాటాకు మచ్చతెగులు:** ఆకులపై పెద్ద అండాకారపు మచ్చలు పెరిగి ముదురు గోధుమ రంగులో ఉంటాయి. నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ. ప్రోపికొనజోల్ కానీ, 1 గ్రాముల కార్బండిజమ్, 2.5 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

రాష్ట్ర జట్లలో జిల్లా క్రికెటర్లకు స్థానం



జి.సుమిత్



పి.నవీన్



కె.సాత్విక్



కె.ఆనంద్ జోషయ్య



ఎం.లేఖజ్‌రెడ్డి

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అండర్-19, 23 వయస్సు విభాగాల క్రికెట్ జట్లకు జిల్లాకు చెందిన పలువురు ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జి.సుమిత్ అండర్-23 జట్టుకు ఎంపిక కాగా, ఎం.లేఖజ్‌లెడ్డి, పి.నవీన్ స్టాండ్‌బైగా వ్యవహరించనున్నారు. కె. సాత్విక్, కె. ఆనంద్ జోషయ్య అండర్-19 జట్టులో స్థానం సంపాదించినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్(పీడీసీఏ) అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. అండర్-19, 23 జట్ల ప్రాబబుల్స్‌కు నిర్వహించిన పోటీల్లో వీరు చూపిన ప్రతిభ ఆధారంగా రాష్ట్ర జట్లలో స్థానం కల్పించినట్లు చెప్పారు. వారికి పీడీసీఏ సభ్యులతో పాటు ఏసీఏ కోచ్‌లు సుధాకర్, చంద్రశేఖర్, మహిళా జట్టు కోచ్ చంద్రిక అభినందనలు తెలిపారు.

నేటి నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్షలు

ఒంగోలు గ్రామీణం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలు చేపడుతున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రైతు, కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడారు. తొలి రోజు యువజన, విద్యార్థి సంఘాలు, తరువాతి రోజు కార్మిక సంఘాలు, చివరి రోజున రైతు సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో ఎం.రమేష్, జి.శ్రీనివాసులు, జయంతిబాబు, పమిడి వెంకటరావు, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఈవోగా వెంకటేశ్వర్లు!

ఒంగోలు నగరం: జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా నరసరావుపేట ఇన్‌ఛార్జి డీఈవో మాదిగాని వెంకటేశ్వర్లు నియమితులు కానున్నారు. మంగళవారం అధికారిక ఉత్తర్వులు వస్తాయని విశ్వసనీయ సమాచారం. అదే విధంగా ఒంగోలు ఇన్‌ఛార్జి ఉప విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న సామా సుబ్బారావును పల్నాడు డీఈవో, నరసరావుపేట ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌ను బాపట్ల డీఈవోగా నియమిస్తున్నట్లు సమాచారం. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పోస్టుకు ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, గుంటూరు జిల్లాకు చెందిన మరొకరి పేరు పరిశీలనలో ఉన్నాయి.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

జగనన్న కాలనీల్లో అవకతవకలపై ఫిర్యాదు

సంతనూతలపాడు: జగనన్న కాలనీల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయని గ్రామానికి చెందిన ఎస్కే షఫీ, నాగూర్‌వలి... ఒంగోలులో సోమవారం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. భూముల కొనుగోలులో అక్రమాలకు పాల్పడ్డారని, అనర్హులకు స్థలాలు కేటాయించారని పేర్కొన్నారు. విచారించి అర్హులైన వారికి స్థలాలు ఇవ్వాలని కోరారు.

సత్రం దారి ఆక్రమణపై..: మద్దిపాడు: మల్లవరం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద... ఆర్యవైశ్య అన్నదాన సత్రానికి వెళ్లే దారిని ఓ వ్యక్తి ఆక్రమించి అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని సత్రం ప్రతినిధి మాదాల రామ్మోహన్‌రావు తదితరులు తహసీల్దార్ సుజన్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ సాయంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించి... అది ప్రభుత్వ స్థలమని నిర్ధారించారు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు.

బడి స్థలం సంరక్షించాలని వినతి: చీమకుర్తి: గాడపర్తివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో చోటుచేసుకున్న ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు సోమవారం విన్నవించినట్లు గ్రామానికి చెందిన జి.ఆంజనేయులు తెలిపారు. సుమారు అయిదెకరాల స్థలం ఆక్రమణకు గురైందని.. పాఠశాల పరిసరాలను పశువుల వ్యర్థాలతో నింపుతుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబును కలిసిన బాలాజీ

ఒంగోలు గ్రామీణం: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నూకసాని బాలాజీ అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటకశాఖకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పరిశ్రుతపై అవగాహన

ఒంగోలు నగరం: నగరంలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్-3 విద్యార్థులు సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక డంపింగ్ యార్డు, రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రోగ్రాం అధికారులు మోహనరావు, మాధవీలత తదితరులు పాల్గొన్నారు. రైల్వే ప్రయాణీకులకు పరిశుభ్రత గురించి వివరించారు.

మిర్చి వ్యాపారి చేతివాటం

గుంటూరు, న్యూస్‌టుడే: పల్నాడు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన 300 మంది రైతులు గుంటూరు నల్లపాడు రోడ్డులో ఉన్న రాఘవేంద్ర శీతలగిడ్డంగిలో మిర్చిని నిల్వ పెట్టుకున్నారు. వ్యాపారి రామచంద్రరావు అలియాస్ రాము.. 880 మిర్చి బస్తాలను రైతులకు తెలియకుండా అమ్మేశాడు. మరో 1000 బస్తాల వరకు ఫోర్జరీ పత్రాల ద్వారా రెండు బ్యాంకుల్లో సుమారు రూ.3 కోట్ల వరకు రుణం తీసుకున్నాడు. విషయం తెలిసి రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న మిర్చియార్డు అధికారులు శీతలగిడ్డంగి మేనేజర్‌తో సంప్రదింపులు జరిపి రైతులకు బాండ్లు ఇప్పించారు. నాలుగు రోజుల క్రితం రామచంద్రరావు ఆత్మహత్యాయత్నం చేయడంతో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అధికారులు తెలిపారు. రైతులు నల్లపాడు ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడి మృతి: కొత్తపట్నం: కొత్తపట్నం జడ్పీటీసీ మాజీ సభ్యుడు మేడా సుబ్బారావు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు మాజీ ఎంపీపీ నాళం నరసమ్మ, తెదేపా నాయకుడు బండారు మదన్ తదితరులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సమతానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు పూజలు చేశారు. పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నాయకుడు కంది రవిశంకర్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైకాపా పాలనలో తిరుపతి లడ్డూలో వాడే నెయ్యిని కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఈ నేపథ్యంలో పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారన్నారు. జనసేన నాయకులు చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, కల్యాణ్ ముత్యాల, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, బ్రహ్మయ్య, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజాదికల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్, జనసేన నాయకులు రియాజ్, రవిశంకర్ తదితరులు

ఆలయ భూములకు కౌలు వేలం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: కొత్తపట్నంలోని నాగేశ్వర, రాజగోపాల స్వామి, ఆదికేశవ దేవస్థానాలు, పాదర్తిలోని భావనారాయణ స్వామి ఆలయాల మాన్యం భూములకు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. ఆదికేశవ స్వామి ఆలయానికి చెందిన కొంత భూమి మినహా... మిగతా వాటి కౌలు వేలం పూర్తయినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్, ఈవో కె.వి. సుబ్రహ్మణ్యం తెలిపారు.

సెంట్రల్ పార్కింగ్ ఏర్పాటు తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సుందరయ్య భవన్ రోడ్డులో మధ్యలో వాహనాల పార్కింగ్ ఏర్పాటును నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ... దీని వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఫుట్‌పాత్ వ్యాపారులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. జయప్రకాష్ కాలనీలో కుళాయి కనెక్షన్లు ఇవ్వడం లేదని తెలిపారు. పలు సమస్యలతో కూడిన అర్జీ అందజేశారు.

ఆరోగ్య అవగాహన ర్యాలీ

ఒంగోలు నగరం: స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం (హెల్దీ ఇండియా)లో భాగంగా... మంగమూరు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నగరంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రిన్సిపల్ శేషయ్య, ఆర్ఐ అనిల్, సమన్వయకర్త శ్రీనివాసరావు, డీన్ సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న చైతన్య పాఠశాల విద్యార్థులు



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న మురళీకృష్ణ

విద్యార్థిని శిక్షణకు చేయూత

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ ఆధ్వర్యంలో... విద్యార్థిని శిఖా దీపికకు నీట్ కోచింగ్ నిమిత్తం రూ.70 వేల సాయం అందజేశారు. హెచ్20 సంస్థ సూచన మేరకు ప్రవాస భారతీయులు బండారి సతీష్, మద్దినేని శిల్ప తదితరులు ఈ మొత్తం సమకూర్చారు. సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో షేక్ సర్దార్ బాషా, మండవ సుబ్బారావు, జనసేన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు అరికట్టేలా మద్యం విధానం ఉండాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యపానం నియంత్రించేలా, నేరాలను అరికట్టేలా నూతన మద్యం పాలసీని ప్రభుత్వం ప్రకటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి డిమాండ్ చేశారు. మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎల్‌బీజీ భవన్‌లో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం పాలసీపై అధ్యయనానికి వెళ్లిన బృందాలు ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ కోరారు. సమావేశంలో న్యాయవాది కె.అరుణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి